# వేదాంతభేరి

ఫిబ్రవరి 2018

రూ. 10/-

# ఓం వేదాంతభేరి ఓం


సంస్థాపకులు : శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సంపుటము : 51 ఫిబ్రవరి 2018 సంచిక : 02



సంపాదకులు

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

సంపాదక మండలి

శ్రీ విజయానంద బ్రహ్మచారి

కె.ఈశ్వర్

డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య, శిరోమణి, ఎం.ఎ.,

డాక్టర్ కె.సర్వోత్తమరావు, ఎం.ఎ., పి.హెచ్.డి.,


శాశ్వత పోషక చందా రూ. 1500/- అంతకుమించి

**సంవత్సర చందా రూ. 100/-లు, విడి సంచిక రూ. 10/-లు**

**విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మెయిలు) 20 డాలర్లు**

**చందాదారులు ఉత్తర ప్రత్యుత్తరాలలో తమ చందా నెంబరు తప్పక వ్రాయవలెను.**


**చందా పంపవలసిన అడ్రసు :**
శ్రీ శుకబ్రహ్మాశ్రమము,
స్వామి విద్యాప్రకాశానంద నగర్,
శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు)
శ్రీకాళహస్తి, పిన్ - 517640
ఫోన్ : 08578- 222239



Printed & Published by Sri Vidyaswarupanandagiri swami on behalf of Sri Sukabrahma Ashramam and Printed by B.Viswanadham at C.N. Printer, TIRUPATI, Andhra Pradesh; Published at Sri Sukabramhasramam, Swami Vidyaprakashananda Nagar, Sri Sukabramhasramam Post, Srikalahasti-517 640, Chittoor Dist., Andhra Pradesh.
Editor : SRI VIDYASWARUPANANDA GIRI SWAMI






## విషయ సూచిక


01. ప్రార్థన - 05
02. శివరాత్రి - శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు - 06
03. సద్గురు బోధ - శ్రీ సద్గురు మలయాళస్వాములవారు - 09
04. శ్రీరామకృష్ణ ఉవాచ - శ్రీ రామకృష్ణ పరమహంస -10
05. అంధుడు - శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు - 12
06. శ్రీ మలయాళస్వామి జీవిత విశేషాలు - 5
- డా ॥ సముద్రాల లక్ష్మణయ్య - 16
07. జ్ఞానసుధ - శ్రీ సర్వభూషణ శివయోగి - 19
08. కౌసల్య వాత్సల్యాకాంక్ష - ఆచార్య కె.సర్వోత్తమరావు - 20
09. భాగవత కథలు - భక్త ధ్రువుడు - శ్రీ రామచంద్రడోంగరే మహరాజ్ - 24
10. హరి పాఠము - శ్రీ జ్ఞానేశ్వర్ మహరాజ్ - 28
11. శివమహిమ్న స్తోత్రమ్ - శ్రీ మధుసూదనీటీక - 30
12. మోళిగ మారయ్య కథ - శ్రీ మాతా గురుచరణానన్ద - 32
13. శ్రీ మదాంధ్ర మహాభాగవతము - ఆచార్య జక్కంపూడి మునిరత్నం-37
14. శైవసిద్ధాంతము - శైవాగమాలు - శ్రీ విద్యాస్వరూపానందగిరిస్వాములవారు -40
12. వార్తలు - 42


**ముఖచిత్రం :**

రామేశ్వరంలోని శివలింగము. 12 జ్యోతిర్లింగాలలో ఇదొకటి

13-02-2018 మహాశివరాత్రి

19-2-2018 తేది సోమవారం అవతార వరిష్ఠులు

శ్రీరామకృష్ణ పరమహంస జయన్తి

ఇందులోని వ్యాసముల భావములకు వ్యాస రచయితలే బాధ్యులు

# ప్రార్థన

ఓం నమస్తే అస్తు భగవన్ విశ్వేశ్వరాయ మహాదేవాయ త్ర్యంబకాయ
త్రిపురాంతకాయ త్రికాలాగ్నికాలాయ కాలాగ్ని రుద్రాయ
నీలకంఠాయ మృత్యుంజయాయ సర్వేశ్వరాయ సదాశివాయ
శ్రీ మన్మహాదేవాయ నమః ॥

**తా ॥** భగవంతుడగు విశ్వేశ్వరునికి నమస్కారము. మహాదేవుడు త్ర్యంబకుడు, త్రిపురాసురుని సంహరించినవాడు, సంధ్యాకాలంలోని త్ర్యగ్నులలో నిండినవాడు, కాలమనే అగ్నిరూపం గలవాడు, నీలిరంగు కంఠం గలవాడు, మృత్యువును తనవశంలో వుంచుకొన్నవాడు (మృత్యుంజయుడు ), ఎల్లప్పుడూ శుభాన్నిచ్చే వాడు అయిన మహాదేవునకు నమస్కారము.

ఓం నమో భవాయ చ రుద్రాయ చ ॥ (5–1)నమశ్శర్వాయ చ పశుపతయే చ ॥ (5–2) నమో నీలగ్రీవాయచ శితికంఠాయ చ । (5–3), నమః కపర్దినేచ వ్యుప్తకేశాయచ (5–4), నమస్సహస్రాక్షాయ చ శతధన్వనే చ । (5–5) నమో గిరిశాయచ శిపివిష్టాయ చ ( 5–6 ) ॥

**తా ॥** సర్వ జగత్తుకు కారణమైనవాడు (మూలమైనవాడు) మఱియు దుఃఖములను పోగొట్టువాడు అగు రుద్రునకు నమస్కారము. సమస్త ప్రపంచాన్ని లయింప జేయు వానికి, పాశబద్ధులైన ప్రాణులన్నిటిని కాపాడు స్వామికి నమస్కారము. కాలకూట విషం త్రాగుట వలన నల్లగా నున్న కంఠము గలవాడు, విషం లేని భాగంలో తెల్లని కంఠం గల స్వామికి నమస్కారము. జటాజూటములు గలవాడు. జుట్టు తీసివేసుకొనిన (ముండిత) శిరస్సుగల స్వామికి నమస్కారము. అనంతమైన కన్నులు గలవానికి, అనంతమైన బాణములు గలవానికి నమస్కారము. కైలాస పర్వతముపై నివసించువానికి విష్ణురూపంలో నున్నవానికి నమస్కారము.

ఓం నమశ్శంభవే చ మయోభవే చ (8–9)। నమశ్శఙ్కరాయ చ మయస్కరాయ చ ( 8–12) నమః ప్రతరణాయ చోత్తరణాయచ ( 8–14).

**తా ॥** ఐహిక సుఖములనిచ్చువాడు, మోక్షమునిచ్చు వాడు అగు స్వామికి నమస్కారము (ఇహపర సుఖములనిచ్చు రుద్రునకు నమస్కారము). మంగళకర కారునికి, పరలోక సుఖాలనిచ్చు వానికి నమస్కారము. పరమశివునకు, అత్యంత మంగళకరునకు నమస్కారము. పుణ్యతీర్థములయందుండు వానికి, నదీ తీరము లందుండు వానికి (శివునకు ) నమస్కారము. శాస్త్ర బోధచేసి తరింప చేయువానికి, జ్ఞానమునిచ్చి తరింపజేయు శివునికి నమస్కారము.





# శివరాత్రి

– శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

శివరాత్రి అనగా శుభకరమగు రాత్రి అని అర్థము. శివరాత్రి అనగానే అందరికి మాఘమాసంలో వచ్చు మహాశివరాత్రి జ్ఞప్తికి వచ్చును. ఇది మనకు మహాపండుగ. ఆనాడు అందరు ఉపవశించి రాత్రంతా జాగరణ చేయుదురు. ఈ జాగరణ సంబంధంగా భగవద్గీతలో శ్రీకృష్ణ భగవానుడీ విధంగా చెప్పారు.

యా నిశా సర్వభూతానాం తస్యాం జాగర్తి సంయమీ
యస్యాం జాగ్రతి భూతాని సా నిశా పశ్యతో మునేః 69

**తా ॥** సమస్త ప్రాణులకును ( సామాన్యజనులకు) ఏది (పరమార్థతత్త్వము) రాత్రియై (దృష్టికి గోచరముకాక) యున్నదో, దానియందు ఇంద్రియనిగ్రహపరుడగు యోగి మేలు కొనియుండును (ఆత్మావలోకనము జేయుచుండును). దేనియందు (ఏ శబ్దాది విషయములందు) ప్రాణులు మేలుకొనియున్నారో (ఆసక్తితో ప్రవర్తించుచున్నారో) అది (విషయజాలము) పరమార్థతత్త్వమును దర్శించు మునీంద్రునకు రాత్రిగా నుండును (దృష్టిగోచరము కాకయుండును).

“అజ్ఞానులకు ఏది రాత్రియో అది జ్ఞానులకు పగలు, జ్ఞానుల కేది రాత్రియో అది అజ్ఞానులకు పగలు.” అని యిట తెలుపబడినది. ఆత్మ, దైవము, ఇంద్రియనిగ్రహము మున్నగు పరమార్థ విషయములు అజ్ఞానుల కేమియును తెలియవు. తెలిసికొనవలెనను కుతూహలమున్ను వారికుండదు. అవియేవియు వారి దృష్టికి గోచరింపవు. అవి వారికి లేనట్లే యగును. కావున అవి వారికి రాత్రివంటివని చెప్పబడినవి. ఆ పరమార్థ విషయములందు వారు అజాగరూకులైయుందురు.

నిదురపోవుచుందురు. నిర్లక్ష్యముగ ప్రవర్తించుదురు. కాని సంయమశీలురైన జ్ఞానులయొక్క వర్తనము దీనికి కేవలము విరుద్ధముగ నుండును. ఏలననిన, వారు నిరంతరము దైవచింతన, ఆత్మానుభూతిగలిగి యుందురు. ఆత్మ విషయమై సదా జాగరూకులై యుందురు. దైవస్మరణను ఒక్కక్షణమైనను విస్మరింపరు. బ్రహ్మానుభూతియందు మేలుకొనియుందురు. కావున అజ్ఞానులు నిదురపోవుచుండు దైవవిషయమున జ్ఞానులు మేలుకొనియే యుందురు. వారి కేది రాత్రియో అదియే వీరికి పగలు.

మఱియు జ్ఞానులగు మహనీయులు ఇంద్రియనిగ్రహపరులై, విషయ భోగములందు విరక్తి గలిగి నామరూపాత్మకమగు ఈ దృశ్యప్రపంచమును మిథ్యగా దలంచుచు, ప్రాపంచిక విషయములం దాసక్తిలేక యుందురు. ఇంద్రియార్థములగు శబ్దస్పర్శాదులందు విముఖత్వము గలిగియుందురు. అవి వారి దృష్టికే గోచరింపవు. కనుక ఈ విషయాదులన్నియు, భోగవిలాసములన్నియు వారికి రాత్రివంటివేయగును. వానియందు సంయమశీలురు నిదురబోవుచుందురు. కాని అవియే అజ్ఞానులకు మహాప్రీతికరములుగ నుండును. అహర్నిశములు వానియందే ప్రీతిగొనుచు, వానినే యనుభవించుచు కాలక్షేపము చేయుచుందురు. ఆ విషయ భోగములందు, నామరూపవ్యవహారములందు వారు సదా జాగరూకులై యుందురు. కాబట్టి అవి వారికి పగలు వంటివి. ఏ ఇంద్రియ విషయములందు జ్ఞానులు నిదురించుచున్నారో, వానియందు అజ్ఞానులు మేలుకొనియున్నారు. వారి కేది రాత్రియో వీరికది పగలు.

రాత్రికాలమున సంచరించు జంతువులనేకములు కలవు – పిల్లి, గబ్బిలము, గుడ్లగూబ, రాక్షసులు, క్రూరమృగములు మున్నగునవి. మనకు పగలు వానికి రాత్రి. వానికి రాత్రి మనకు పగలు. అజ్ఞాను లీనిశాచరుల కోవకు చెందినవారు. జ్ఞానులు దినచరుల వర్గమునకు జెందినవారు.

"సంయమీ"– అని ప్రయోగించుటవలన ఇంద్రియ నిగ్రహము పరిపూర్ణముగ గలవాడే ఆత్మవిషయమున మేలుకొనగలడనియు (జాగర్తి), అట్టి సంయమములేనివానికి దైవము (ఆత్మ) కానరాడనియు స్పష్టముగ బోధపడుచున్నది. ఇవ్విధముగ అధ్యాత్మక్షేత్రమున సంయమము (ఇంద్రియ నిగ్రహము)న కెట్టి మహోన్నతస్థానము కలదో యిట చక్కగ నిరూపింపబడినది.

"పశ్యతో మునేః" – మునులు అనగా మననశీలు రనేకులుండ వచ్చును గాని ఆత్మ దర్శనమునొందిన మును లరుదు.'పశ్యతః' అని చెప్పినందువలన భగవంతుని (ఆత్మను) ప్రత్యక్షముగ చూడవచ్చుననియు, అనుభూతమొనర్చుకొనవచ్చుననియు నిట స్పష్టమగు చున్నది. అట్టి స్థితిని ప్రతివారున్ను పొందవలసియున్నది. విషయ భోగములను త్యజింపవలెననియు, ఇంద్రియనిగ్రహము గలిగి ఆత్మయందు సదా మేలుకొనియుండవలెననియు ఈ శ్లోకమున చెప్పబడినది. ఇదియే జాగరణ ఇదియే నిజమైన శివరాత్రి.

# కర్మయోగం

మనం ఏ పనిచేసినా అది జగత్తులో ఒక భాగమవుతుంది. ఏప్పుడైతే కర్మ జగత్తులో ఒక భాగమవుతుందో అప్పుడు మన కర్మల మీద జగత్సూత్రాలు పనిచేస్తాయి. ఎందుకంటే జగత్ మొత్తం ఆ సూత్రాల మీద నడుస్తుంది. అలా ప్రక్రియ వల్ల వచ్చే కర్మని ఫలం అంటారు. అలా ప్రతి కర్మా ప్రాసిస్ అయి ఫలంగా మనకు తిరిగి వస్తుంది. జగత్సూత్రాలు పరమాత్మ చేతిలో పరికరాలు. అందువల్ల కర్మసూత్రాల వలన ప్రాసెస్ అయిందీ అంటే అర్థం పరమాత్మ ఆ ప్రాసిసింగ్ చేస్తున్నాడని అర్థం. అందువలన కర్మ దేవునిదగ్గఱకు వెళ్ళి ఫలరూపంలో తిరిగి వస్తోంది.

ఈ నిజాన్ని తెలుసుకొని దాన్ని గుర్తుంచుకొన్నప్పుడు ప్రతికర్మను ఈశ్వరార్పణగా చేస్తాము. జ్ఞానోదయం పొందిన కర్మయోగికి ప్రతికర్మ ఈశ్వరార్పణే. ఈ ఎఱుకను ఈశ్వరార్పణ భావన అంటారు. ఈశ్వరార్పణ భావనతో చేస్తే పరమాత్మ నుంచి వచ్చిన ఫలాన్ని కర్మఫలం అనరు ఈశ్వర ప్రసాదం అంటాము. కర్మఫలాన్ని ఈశ్వర ప్రసాద భావనతో స్వీకరించడమే యోగము. **– శ్రీ స్వామి పరమార్థానంద (చెన్నై)**

# సద్గురు బోధ

- శ్రీ సద్గురు మలయాళస్వాములవారు

**1.** నీళ్లచే నిప్పును చల్లార్చునట్లు శాంతముచే కోపమును, సత్యముచే అసత్యమును, ధర్మముచే అధర్మమును, శ్రద్ధచే ఆలస్యమునున్ను జయించవలెను.

**2.** ప్రకాశంచే తమస్సును పోగొట్టునట్లు కరుణచే కాఠిన్యమును, త్యాగంచే లోభమును, విరాగంచే రాగమును, దయచే భేదబుద్ధిని పోగొట్టవలెను.

**3.** నావచే సముద్రమును దాటునట్లు జ్ఞానముచే సంసారమును, ధ్యానంచే మాయను, యోగంచే మనస్సును, ధైర్యంచే శోకమును దాటవచ్చును.

**4.** వర్షంచే దావాగ్ని శమించునట్లు భక్తిచే తాపత్రయాగ్నియు, ప్రేమచే ద్వేషబుద్ధియు, అమృతత్త్వముచే మృత్యువున్ను, పారిశుద్ధముచే మాలిన్యమున్ను శమించును.

**5.** ఇతరుల వస్తువులను తీసుకొనినచో నీ పుణ్యము పోయి వారి పాపము నిన్ను పట్టుకొని ఇది వరకటి కంటే కామక్రోధాదులు అధికమై మనశ్చలనమున్ను యెక్కువై పీడించును.

**6.** ప్రతిరోజు నూరుచుండెడి కత్తి ఎట్లు నిరన్తరము మంచి వాడి కలిగి యుండునో ఆలాగున గురువు దగ్గఱ ఉండి సదా గురుసేవ చేయువాని మనస్సు బహుతీక్ష్ణమై జాగ్రతగలిగి యుండును.

**7.** ఎంతకెంతకు మనస్సు దైవవిషయమై తీవ్రనిష్ఠ, ఏకాగ్రత గలిగి యుండునో, అంతకంతకు దైవప్రాప్తిలో గల విఘ్నములన్నియు తొలగుటయే గాక దైవప్రాప్తియు శీఘ్రముగనే గలుగును.

**8.** సోమరితనము గల జీవితము అనగా పరిశ్రమ చేయని బ్రతుకు మొదట సుఖకరముగ కనిపించినను, ఏలాంటి యున్నతస్థితి కలుగకపోవుటయే గాక జీవితాంతమువఱకు పరులనాశ్రయించియే జీవించవలసియుండును.

**9.** ఈశ్వరుడు సకల పరమాణువులలో కూడ వెలుగుచున్నను, అప్రాకృతదివ్యచక్షుస్సు గలవారగు వఱకు ఎవరికిని కనిపించడు.

**10.** దృశ్య విషయసుఖమునకు పరుగిడు మనస్సు దృక్కగు ఆత్మలో లయించి శాశ్వత బ్రహ్మ సుఖము నొంది సుఖింపజాలదు.

# శ్రీరామకృష్ణ ఉవాచ

- శ్రీ రామకృష్ణ పరమహంస

**శ్రీరామకృష్ణులు :**కొందరు ఇలా తలపోస్తారు. 'బహుశ నాకు భక్తి జ్ఞానాలు అలవడవు. నేను బద్ధజీవిని,'అని. కాని గురువు అనుగ్రహం ఉంటే ఎంత మాత్రం భయపడవలసిన పనిలేదు.

ఒకప్పుడు గర్భం ధరించిన ఆడపులి ఒకటి ఒక మేకల మందపై పడ్డది. అలా మందపై దూకేటప్పుడు అది పులిపిల్లను ప్రసవించి చచ్చిపోయినది. ఆ పులిపిల్ల మేకలతో పాటే పెరుగసాగింది. ఆ మేకలు గడ్డిని మేసేవి. ఈ పులి పిల్లకూడ గడ్డినే మేయసాగింది. మేకల మాదిరే ఇది కూడా 'మే, మే' అని అరవసాగింది. క్రమంగా ఆ పిల్ల పెద్దపులిగా ఎదిగింది.

ఇలా ఉండగా ఒకరోజు మరొక పెద్దపులి ఆ మేకల మందపై దాడిచేసింది. అక్కడ 'పచ్చిగడ్డి తినే ఆ పెద్దపులిని' చూసి ఈ పెద్దపులి విస్తుపోయింది. దానివెంట పరుగెత్తి, దానిని దొరకబుచ్చుకోవడంతో అది 'మే, మే' అంటూ అరవసాగింది. ఈ పెద్దపులి ఆ మేక –పులిని నీటివద్దకు ఈడ్చుకుపోయి దానితో ఇలా అంది. 'చూడు. నీళ్లలో నీ ముఖాన్ని చూసుకో. అది నా ముఖంలాగే ఉండటం గమనించు. ఇదిగో, ఈ కాస్త మాంసాన్ని తిను.' ఇలా అంటూ ఆ పెద్దపులి దాని నోట్లో మాంసాన్ని బలవంతంగా కూరింది. కాని ఆ 'పచ్చగడ్డి తినే పులి' ఆ మాంసఖండాన్ని తిననే తినదు. 'మే, మే' అంటూ అరవసాగింది. కాని క్రమంగా అది రక్తం రుచి మరిగి మాంసాన్ని తినసాగింది. అప్పుడు ఆ పెద్దపులి ఇలా అంది. 'ఇప్పుడు అర్థమయ్యింది కదా ! నేను ఎవరినో, నువ్వు కూడా అదే. ఇక రా నాతోబాటు. అడవిలోకి వెళ్దాం.

అందుకనే గురువు అనుగ్రహం కలిగినప్పుడు భయానికి తావే

ఉండదు. నువ్వు ఎవరివో నీ స్వరూపం ఏమిటో ఆయన నీకు తెలియజేస్తాడు.

ఒకింత ఆధ్యాత్మిక సాధన చేయగానే గురువు "ఇదే, ఇదే " అని తెలియజేస్తాడు. అప్పుడు శిష్యుడే సత్యం ఏమిటో, అసత్యం ఏమిటో స్వయంగా తెలుసుకోగలుగుతాడు. భగవంతుడొక్కడే సత్యం, ఈ ప్రపంచం అనిత్యం అని తెలియవస్తుంది.

ఒకనాటి రాత్రి బెస్తవాడొకడు ఒక తోటలో ప్రవేశించి అక్కడున్న చెరువులో వలవేసి దొంగతనంగా చేపలు పడుతూన్నాడు. తోట యజమానికి ఆ సంగతి తెలియడంతో అతడి మనుష్యులు ఆ బెస్తవాణ్ణి చుట్టుముట్టారు. దివిటీలు వెలిగించి ఆ బెస్తవాడి కోసం గాలించసాగారు. ఈలోపు బెస్తవాడు ఒంటినిండా బూడిద పూసుకొని సాధువులా నటిస్తూ ఒక చెట్టుక్రింద కూర్చున్నాడు. తోట యజమాని, పనివాళ్లు ఎంతగా వెదకినప్పటికీ దొంగను కనుగొనలేకపోయారు. వారికి అక్కడ కంటబడింది. ఒక చెట్టు క్రింద ధ్యానంలో కూర్చున్న సాధువు మాత్రమే! ' ఆ తోటలో ఓ గొప్ప సాధువు వెలసాడు' అనే వార్త మర్నాడు ఆ పరిసరాలలో వ్యాపించింది. అనేకులు సాధువును దర్శించుకొని పువ్వులు, పళ్లు, మిఠాయిలు సమర్పించి భక్తిప్రపత్తులతో ప్రణామాలు చేయసాగారు. వారిలో కొంతమంది ఆతడికి దక్షిణ కూడా సమర్పించారు. అప్పుడు ఆ బెస్తవాడు ఇలా తలపోశాడు. 'ఎంత విచిత్రం ! నేను నిజమైన సాధువును కాను. అయినప్పటికీ జనం నా పట్ల ఎంతో భక్తి ప్రపత్తులు కనబరుస్తున్నారు. నేను నిజమైన సాధువుగా మారితే భగవంతుని తప్పక పొందగలుగుతాను. ఇందులో సందేహం లేదు.'

కేవలం కపట సాధన మాత్రం చేతనే అంతటి ఆధ్యాత్మిక చైతన్యం జాగృతం అయినప్పుడు, యథార్థమైన సాధనా ప్రభావం గురించి వేరే చెప్పవలసింది ఏముంది ? ఏది సత్యమో, ఏది అసత్యమో ఎరుకలోకి వస్తుంది. భగవంతు డొక్కడే సత్యం, ఈ సంసారం యావత్తు అనిత్యం అన్న ఎరుక కలుగుతుంది.





# అంధుడు

- శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

ఆత్మ శాశ్వతమని, దేహాది దృశ్యపదార్థములు అశాశ్వతములని యెఱుగువాడు, ఇట్లెఱిగి ఆత్మ స్వరూపమున నిలకడ గలిగి, దృశ్యవస్తువు లందు వ్యామోహము లేనివాడు నిజంగా నేత్రములు కలవాడు. ఇదియే జ్ఞానదృష్టి. బాహ్యవస్తువులను జూడగల్గు భౌతికదృష్టి యున్నప్పటికిని ఎవరికీ జ్ఞానదృష్టి యుండదో అట్టివారిని దుఃఖములు వెన్నంటుచునే యుండును. అతడు అంధుడేయగును.

మహాంధుడెవడు ? అని శ్రీ శంకరాచార్యులవారు ప్రశ్నించి 'కో వా మహాన్ధో మదనాతురో యో ' కామాది వికారములకు వశీభూతుడగు వాడే మహాంధుడని ప్రత్యుత్తరమిచ్చియుండిరి. అంధత్వము శరీరమును బాధించును. మహాంధత్వము శరీరమనంబుల రెండిటిని బాధించును. అందఱికి రెండుకన్నులుండగా రావణాసురునకు ఇరువది కన్నులున్నవి. కాని ఏమి లాభము ? జ్ఞాననేత్రము లేని కారణముచే మహాంధుడై, మదనాతురుడై, గోతిలో పడిపోయి జీవితమును సర్వనాశన మొనర్చు కొనెను. కావున వివేకనేత్రము, జ్ఞాననేత్రము, దివ్యనేత్రము చాల ముఖ్యమైనది. దానిని మనుజులు ఈ జన్మయందు ప్రయత్నపూర్వకముగ సంపాదించవలసి యున్నారు.

మహాంధత్వము సంభవించునపుడు మనుజుడు ఉన్న దానిని లేనిదిగను, లేనిదానిని ఉన్నదిగను, నిత్యమైనదానిని అనిత్యముగను అనిత్యమైనదానిని నిత్యముగను, పవిత్రమైనదానిని అపవిత్రముగను, అపవిత్రమైన దానిని పవిత్రముగను, ఆత్మ వస్తువును అనాత్మగను, అనాత్మ వస్తువును ఆత్మగను భావించుచుండును. అట్టి మహాంధత్వమును సద్గురుసాన్నిధ్యమున జ్ఞానాంజనముచే రూపుమాపి నిర్మల జ్ఞానదృష్టిని

బడయవలెను. జ్ఞాననేత్రముగల జీవితమే జీవితము. ఈ జ్ఞాన చక్షువును గురించి గీతయందు అచటచట ప్రస్తావించుట జరిగినది.

'పశ్యన్తి జ్ఞానచక్షుషః ' (15–10), 'అన్తరం జ్ఞానచక్షుషా' (13–35), 'దివ్యం దదామి తే చక్షుః' (11–08). జ్ఞాననేత్రము యొక్క ఆవశ్యకతను పరమాత్మ పైవాక్యముల ద్వారా లోకమునకు స్పష్టమొనర్చెను. జ్ఞానదృష్టిలేని వారు, అవిద్యను ఆశ్రయించువారు. అంధకార పూరితములగు తమోమయ లోకములను బొందవలసి వచ్చు ననియు, ప్రబలతర దుఃఖములననుభవింప వలసి వచ్చుననియు ఉపనిషత్తులు వేనోళ్ళ పలుకుచున్నవి.

కావున అంధత్వమునకు చికిత్స యొనర్చుటకై కృషిసలుపులాగున, మహాంధత్వ నివారణకున్ను మహత్తర కృషిసలిపి జనులు చక్కని జ్ఞానదృష్టిని బడసినవారై, జ్ఞానచక్షువులచే భగవద్దర్శనము గావించుకొని జీవితమును పరమానంద మయముగ నొనర్చుకొనవలయును. అట్టి జ్ఞానదృష్టి కలిగి యుండుటయే వాస్తవమగు పాండిత్యము.

విద్యలందు నేర్పరితనము, కవిత్వాదులందు చక్కని కుశలత్వము, గ్రంథరచనా నైపుణ్యము, కావ్య నాటకాలంకార పరిజ్ఞానము, కళాకౌశల్యము, విద్యావైదుష్యము కలిగియుండుటయే పాండిత్యమని సామాన్యముగ జనులు తలంచుచుందురు. అట్టి పాండిత్యము కలవానిని పండితుడనియు పేర్కొనుచుందురు.

కాని శ్రీకృష్ణపరమాత్మ గీతయందు ఎవరినిగూర్చియు, దేనిని గూర్చియు శోకింపనివారే పండితులనియు (నానుశోచన్తి పండితాః) జ్ఞానాగ్నిచే సమస్తకర్మలు దగ్ధమొనర్చు కొనినవారే పండితులనియు (జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణం తమాహుః పండితం బుధాః) సమస్త చరాచర ప్రాణికోట్లయందును సమదృష్టికలవారే పండితులని (పండితాః సమదర్శినః) వక్కాణించెను. మృత్యువును జయింపగల్గుటయే యథార్థమగు పాండిత్యము. అట్టి పాండిత్యశక్తిని అలవఱచుకొననివాడు ఎన్ని లౌకికవిద్యలం దారితేరినప్పటికిని, శాంతిని నోచుకొనలేడు. మృత్యువును తప్పించుకొనలేడు.



జనన మరణ ప్రవాహమును దాటలేడు, కర్మ బంధనమును విచ్ఛిన్న మొనర్చుకొనలేడు.

నిరక్షరస్యాపి తు యస్య కుక్షౌ
బ్రహ్మైవ చాభాతి స ఏవ సాక్షరః
సర్వాక్షరస్యాపి తు యస్య చిత్తే
బ్రహ్మైవ నాభాతి స వై నిరక్షరః

చదువు లేనప్పటికిని, ఓనమాలు రానప్పటికని, ఎవని హృదయ మందు పరబ్రహ్మము సదా భాసించుచుండునో, ఎవడు ఆత్మానుభూతి చక్కగ కలిగియుండునో అతడు సమస్త విద్యలను నేర్చుకొనినవాడే యగును. సమస్త విద్యలయందును ఆరితేరినప్పటికిని ఎవడు దైవానుభవములేక యుండునో అతడు వాస్తవముగ నిరక్షరకుక్షియే యగును. కావున లౌకిక పాండిత్యముతో పాటు పారమార్థిక పాండిత్యముకూడ కలిగి యుండుట శ్రేయస్కరము.

శ్రీ వసిష్ఠ మహర్షి శ్రీరామచంద్రునకు పెక్కు ధర్మ రహస్యములను ఉద్బోధించుచు, సంసారకూపము నుండి లేవనెత్తి తిరిగి అట్టి కూపమున బడకుండ చేయునట్టిదే పాండిత్యమనియు, అద్దానిని యత్నపూర్వకముగ సంపాదించవలయుననియు ఉద్ఘాటించెను.

తావన్మాయా భవభయకరీ పండితత్వం న యావ
త్తత్పాండిత్యం పతసి న పునర్యేన సంసారచక్రే
యత్నం కుర్యాదవిరతమతః పండితత్వే ఽ మలాత్మా
జ్ఞానోదారే భయమితరథా నైవ సః శాన్తిమేతి ( వసిష్ఠగీత )

కావున ముముక్షువగువాడు సంసారతారకమగు ఈ పాండిత్యమును సద్గురు, సచ్ఛాస్త్ర సహాయముచే తప్పక బడయవలసి



వేదాన్తభే... చం...
మురళీధర కృష్ణుడు
ollow the master

యున్నది. 'నహి నహి రక్షతి డుకృఙ్కరణే' అని శ్రీ శంకరాచార్యులు నుడివినట్లు వ్యాకరణాది విద్యలు అంత్యకాలమున జీవుని బాధలు తొలగించనేరవు. మృత్యువాత నుండి అతనిని తప్పించలేవు. కాబట్టి ఇతర విద్యలెన్ని నేర్చినప్పటికిని, ఎంతటి లౌకిక పాండిత్యప్రకర్షము కలిగి యున్నప్పటికిని, ఆత్మజ్ఞానమను పాండిత్యమును బడయనిచో జీవుడు తప్పించుకొన జాలడు.

అక్షరమగు పరమాత్మనుగూర్చిన పరిజ్ఞానము కలవాడే అక్షర జ్ఞానముకలవాడని యెఱుగవలెను. క్షరవస్తువుల కొఱకై ప్రాకులాడుటలోనే జీవితమంతయు వెచ్చించువాడు, అక్షరమగు సచ్చిదానందాత్మ స్వరూపమును గూర్చి ఒకింతైనను ప్రయత్నము సలుపనివాడు, తుదకు పశ్చాత్తాపడవలసి వచ్చును. ఎన్ని విద్యలు గడించినప్పటికిని, సంసార సముద్రమును తరింపజేయునట్టి తారక విద్యను అభ్యసింపనిచో, జన్మ మృత్యు జరావ్యాధియుక్తమగు ఈ దుఃఖోదధియందు మరల మరల గృంకులిడక తప్పదు. కావున, ప్రాపంచిక విద్యా వైదుష్యముతోబాటు బ్రహ్మజ్ఞానరూప పాండిత్యమును జీవుడు యత్నపూర్వకముగ బడసి అనాది కాలము నుండి తనను తరుముకొని వచ్చుచున్న మాయయను పెనుభూతముయొక్క బెడదను తప్పించుకొని బంధవిముక్తుడై పరమానంద మనుభవించవలయును. జ్ఞాననేత్రమును చక్కగ వికసింపజేసికొనవలెను.

## పదవ జ్ఞానసదస్సు

**2018 ఫిబ్రవరి 25వ తేది ఆదివారం నుండి మార్చి 1వ తేది గురువారం పౌర్ణమి వరకు 5 రోజులు 10వ జ్ఞాన సదస్సు శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో జరుగును.**

| | | |
|---|---|---|
| **ఆచార్యులు** | : | **పూజ్య శ్రీ యోగినిచంద్రకాళీ ప్రసాదమాతాజీ వారు (కాళీవనాశ్రమం)** |
| **విషయం** | : | **కైవల్యోపనిషత్తు, జిజ్ఞాసువులందరికి ఆహ్వానము.** |

# శ్రీ మలయాళస్వామి జీవిత విశేషాలు - 5
# పునర్జన్మ కొరకే ఈ తపస్సు

– డా ॥ సముద్రాల లక్ష్మణయ్య, (తిరుపతి)

**ఎవడు బ్రాహ్మణుడు ?**

**మూలం** **బుద్ధుని ధర్మపదం**

**అనువాదం** – బ్రహ్మచారి ఆనందమోహన్

శ్రీ మలయాళ సద్గురు[illegible]లో తిరుమలలోని గోగర్భ తీర్థంలోనే ఎక్కువ సమయం గడిపేవారు. ఇతర తీర్థాలలో గూడా కొంతకాలం నివసించి తపోనిష్ఠ కొనసాగించేవారు.

ఒకసారి స్వామి సనకసనందన తీర్థంలో ఉన్నప్పుడు జిజ్ఞాసువైన ఒక భక్తుడు స్వాములవారిని దర్శించి ఇలా ప్రశ్నించాడు.

"స్వామీ ! తాము ఎందుకు ఈ నిర్జన ప్రదేశంలో ఉండి తపస్సు చేస్తున్నారు ? భగవంతుడు ప్రత్యక్షం కావాలనా ? మోక్షం కావాలన్న కోరికతోనా ? లేక ఇంకా ఏదైనా కార్యలాభం అపేక్షించా? "

అందుకు స్వామీజీ ఇలా సమాధానం చెప్పారు. "మహాశయా! భగవత్సాక్షాత్కారం కొరకై నేనిక్కడ తపస్సు చేయడం లేదు. భగవంతుడు పూర్వం అనేకులకు ప్రత్యక్షమై ఉపదేశించిన విషయాలు గీతాది గ్రంథాలలో ఉన్నాయి కదా ! అంతకంటే ఇప్పుడు క్రొత్తగా ఆ దేవుడు చెప్పవలసిన విషయాలేమున్నాయి ?

ఇక మోక్షం కొరకంటారా ? అది ప్రాణికోట్లకన్నింటికీ స్వతస్సిద్ధమై యున్నది. బద్ధుడైన వానికి మోక్షం కోరదగినదే కాని ముక్తుడు దానిని కోరవలసిన అవసరమేమున్నది ? ఆత్మను బంధించగల వస్తువేదీ ప్రపంచంలో లేదు.

ఇతర కార్య లాభాలపై గూడా నాకు కోరిక లేదు, 'యల్లాభాన్నాపరో లాభః' అన్నట్లు ఆత్మ లభించియుండగా ఇక

అంతకుమించి లభించదగినదే ముంటుంది ? ఇప్పటి ఈనాస్థితి నానైజ గుణమే. ఇది గొప్ప తపస్సు అని కానీ, వైరాగ్యమనికానీ, వ్రతమని కానీ నేను భావించడం లేదు. బ్రహ్మనిష్ఠులకు తపశ్చర్యాదులు సహజాలే.

నేనిచ్చట ఉండడానికి హేతువేమో చెబుతాను. స్వర్గనరకాలు నాకు లేవు. నేను కామ్యకర్మ పరుడను కాను. ఒక్క భయం నుండి తప్పించమని నేను భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను. ఇంతవరకు భగవత్ప్రీతికరకార్యాలు చేశాను గాన ఆ భగవానుడు నాకు జన్మరహిత మోక్షం ఇచ్చేస్తాడేమో అనేదే నా భయం. నాకు పునర్జన్మ ప్రసాదించవలసిందిగా భగవంతుణ్ణి వేడుకొంటున్నాను. ఆ జన్మలో ధనికుడుగా, సుందరుడుగా, బ్రాహ్మణుడుగా, పండితుడుగా ఉండాలని నేను కోరుకోవడం లేదు. నేను ప్రాపంచిక భోగం కోరేవాడను కాను. మాట్లాడుట, చూచుట, వినుట మొదలగు శక్తులు గల ఏ జన్మ సిద్ధించినా, అదే చాలు.

ఆ జన్మలో నాకు భగవంతునితో వియోగం సంభవించగూడదు. తైలధారవలె అవిచ్ఛిన్నమైన భక్తి ఉండాలి. ఈశ్వరుని సన్నిధి చేరడానికి ఎవరెవరికేయే ఆటంకాలు కలవో, వాటిని తొలగించేదానికీ, జనుల అంతఃకరణములో అనాదిగా నిండియున్న అజ్ఞానాన్ని నివృత్తి చేయడానికీ, అవసరమైన జన్మనే నేను కోరుకొంటున్నాను.

జనులందరిలో ఒకే ఆత్మకలదనీ, అజ్ఞానముచేత భేదం కనిపిస్తున్నదనీ, ఆ భేదదృష్టి పాపమనీ, దాని నుండి విముక్తి పొందడమే ముక్తి అనీ, ఉపనిషత్తులు ప్రతిపాదించిన వేదాంతం ఇదే అనీ, ఇదే మోక్షమనీ, నిర్వాణమనీ జనానీకానికి తెలపడానికి తగిన జన్మనే నేను కోరుకొంటున్నాను.

జనులు పరమపావనులయ్యే వరకూ, సత్యార్థమును అందరూ గ్రహించే వరకూ, అందరికీ సత్యజ్ఞానానంద నిత్యపుణ్యమూర్తులనే బోధ కలిగే వరకూ, మరల మరల మానవుల ఆత్మోద్ధార లోకోద్ధార ప్రవృత్తిలో



ప్రవర్తించే జన్మమునే నేను కోరుకొంటున్నాను. బాహ్యదృష్టికి కనిపించే భేదాలన్నీ గుణకర్మల వల్ల కల్గినవే కాని యథార్థములు కావనీ, అన్ని ప్రాణులూ సుఖమునే కోరుతున్నాయనీ, వాటి సుఖమార్గానికి అడ్డుపోరాదనీ, పోతే మహాపాపమనీ బోధించే జన్మమే నేను కోరుకొంటున్నాను. అందుకే ఈ నా తపస్సు.

## నామ సంకీర్తన

హర ఓం హర ఓం సదాశివా ! హరిఓం హరిఓం నారాయణా!
పన్నగ భూషణ సదాశివా ! పన్నగశయనా నారాయణా !
గౌరీవల్లభ సదాశివా ! లక్ష్మీవల్లభ నారాయణా !
కైలాసావాసా సదాశివా ! వైకుంఠ వాసా నారాయణా !
శంభోశంకర సదాశివా ! మాధవకేశవ నారాయణా !
ఆపద్బాంంధవ సదాశివా ! అనాథ రక్షక నారాయణా !
హర హర హర హర సదాశివా ! హరి హరి హరి హరి నారాయణా!

## గృహవైద్యం

**1.** నిమ్మరసం మఱియు తేనె ఒక్కొక్క స్పూను వంతున కలిపి చిన్న అల్లం ముక్కతో పడగడుపున ఒక మాసం సేవిస్తే గ్యాస్టిక్ ట్రబుల్స్ మాయమౌతవి.

**2.** తులసి ఆకు రసంలో తేనె, అల్లపురసం కలిపి సేవించిన జలుబు, దగ్గు తగ్గునూ.

# జ్ఞాన సుధ

మూలం
శ్రీ సర్పభూషణ శివయోగి

అనువాదం :
శ్రీ శంకరానందగిరి
స్వాములవారు
(ఉమామహేశ్వర పీఠాధిపతులు)

**అవ :** ఈ యాత్మయందే ఆయా మతస్థులచేత శివశక్త్యాది దేవతలు భావింపబడుచున్నారని సదృష్టాంతముగా తెలుపుచున్నారు.

**స్పృష్టావయవై రన్ధై**
**స్తత్తద్రూపో గజో యథా ఽ ఽ త్మాయమ్**
**శాక్తేయ శైవ వైష్ణవ**
**ముఖ్యైః స్వం స్వం ప్రతీయతే దైవమ్** ॥౧॥

అన్ధైః= గ్రుడ్డి వారిచేత, స్పృష్ట= తడవిచూడబడిన, అవయవైః= శ్రోత్రాది అవయవములచేత, గజః= ఏనుగు, తత్తద్రూపః యథా=చేట, రోకలి, స్తంభము ఇత్యాది రూపములు గలదివలెనే, అయం ఆత్మా = ఈ ఆత్మయు, శాక్తేయ శైవ వైష్ణవ ముఖ్యైః = శాక్తేయులు, శైవులు, వైష్ణవులు మొదలగు వారిచే, స్వం స్వం దైవం = తమ తమ దేవత, ప్రతీయతే= గ్రహింపబడుచున్నది.

పుట్టంధులు నలుగురు ఒకచోట జేరి ఏనుగును కనిపిట్టెదమని తలంచి ఒక యేనుగయొద్దకు బోయి దాని అవయవములలో ఒకానొకటి తడవిచూచి ఇదే యేనుగు ఇదే యేనుగని ఊహింపసాగిరి. ఎట్లన, ఒకడు ఏనుగ చెవులు పట్టుకొని చేటవలె నున్నదనియు, ఇంకొకడు తొండమును గ్రహించి రోకలివలె నున్నదనియు, మఱొకడు కడుపును స్పృశించి నగారావలె నున్నదనియు, వేఱొకడు తోకను తాకి చీపురువలె నున్నదనియు తమతమ బుద్ధికి తోచినట్లు ఏనుగును నిర్ణయించిన విధమున అద్వితీయుడగు పరమాత్మను ఆయా మతస్థులు తమ తమ సంస్కారానుసారము శివునిగను, విష్ణువునిగను, శక్తిగను ఇట్లు తమతమ దేవతారూపునిగా గ్రహించుచున్నాను. “ఇంద్రోమాయాభిః పురురూప ఈయతే” అని శ్రుతి.

# కౌసల్య వాత్సల్యాకాంక్ష

– ఆచార్య కె. సర్వోత్తమరావు, తిరుపతి

పురాణేతిహాసాలలో శ్రీమద్రామాయణానికున్న ప్రశస్తి ప్రఖ్యాతి మరేదానికి లేదు.ప్రత్యేకించి తెలుగు వారికి రామాయణ ప్రీతి అతివేలం. చిలుకలకు రామాయణ పాత్రల పేర్లు పెట్టుకొన్న జాతి. రామచిలుక, సీతాకోకచిలుకలని. పండ్లకు కూడా రామాఫలం, సీతాఫలమని. ఇక ఊర్ల పేర్లు, ఇంటిపేర్లు వ్యక్తులపేర్లు అసంఖ్యాకం.

“ అయోధ్య రామన్న అన్నయ్య మాకు ”

వాలుగన్నుల సీత వదినమ్మ మాకు ” అని ఆత్మీయతను చాటుకొన్న జాతి.

శ్రీరాముడు మర్యాదాపురుషోత్తముడు. పితృవాక్యపాలనాపరుడు. తల్లి కౌసల్య కంటె పినతల్లి కైక దగ్గర చనువు గలవాడు. అయినా కైక ఆంక్షల మేరకు అరణ్యానికి కదలవలసివచ్చింది. తల్లి దగ్గరికి వెళ్ళి నమస్కరించాడు. తల్లి వగచింది. అయినా కుమారునికి మంగళాశాసనం చేసింది. శ్రీమద్రామాయణంలో అయోధ్యాకాండలో 25వ సర్గ ఈ వృత్తాంతాన్ని రమ్యంగా విశదీకరించింది. ‘వర్తస్వ చ సతాం క్రమే’ సత్పురుషుల మార్గంలో ప్రవర్తించమంటూ 20 శ్లోకాలతో దీవించింది.

“ ఓ రామా ! నీ వనుసరించే ధర్మం నిన్ను కాపాడుగాక ! నీచే ప్రణతులందుకొనే దేవర్షులు రక్షింతురు గాక ! విశ్వామిత్ర దత్త అస్త్రములు సర్వదా ఆదుకొను గాక !

మాతాపితృసేవలు, సత్యబలం, అగ్నివేదికలు, దేవాలయాలు చరాచర ప్రకృతి వనంలో రక్షించుగాక ! ఆదిత్యులు, లోకపాలురు, సమస్త దేవతలు నీకు శుభములు చేకూర్చుదురు గాక !

వసంతాది ఋతువులు, శుక్లకృష్ణ పక్షములు, చైత్రాది

మాసములు, ప్రభవాది సంవత్సరాలు, దివారాత్రులు, ముహూర్తములు నీకు సర్వదా సుఖావహములగు గాక, స్మృతి (ధ్యానం), ధృతి (ఏకాగ్రత), ధర్మం అన్ని విధాల ప్రోచుగాత !

పూజ్యుడయిన కుమారస్వామి, చంద్రభగవానుడు, బృహస్పతి, సప్తర్షులు, దేవర్షి నారదుడు అన్ని విధాల రక్షింతురు గాక ! సుప్రసిద్ధులయిన సిద్ధగణం, దిశలు, దిక్పాలురు, నా స్తుతుల నందుకొనిన వారందరు అచట వనములలో నిన్ను నిరంతరం రక్షింతురు గాక !

సమస్తకులపర్వతాలు, సముద్రాలు, కుబేరుడు, వరుణదేవుడు, ఆకాశం, అంతరిక్షం, భూమి, ఆలాగే సకలనదులు, నక్షత్రాలు, సమస్త గ్రహాలు, గ్రహాభిమాన దేవతలు, దివారాత్రములు, ఉభయ సంధ్యాది దేవతలు వనవాసినివైయున్న నిన్ను రక్షింతురుగాక !

పవిత్రమూర్తులైన ఋతు, మాస, సంవత్సరాల అధిదేవతలు, కళలు కాష్ఠలు ఇవన్నీ సుఖకరములగుగాక :

ధీశాలివైన నీవు మునివేషధారివై, మహారణ్యంలో సంచరించే వేళ ద్వాదశాదిత్యులు, దైత్యులు, అనవరతం నీకు సుఖసంతోషాలను కూర్తురు గాక !

కుమారా ! భయంకరాకారులయిన, క్రూరకర్ములయిన మాంసభక్షకులయిన రాక్షస, పిశాచాదుల వలన నీకు ఏలాంటి భయము లేకుండుగాక !

భయంకరమైన అరణ్యంలోని వానరాలు, త్రేళ్ళు, అడవి ఈగలు, దోమలు, కొండపాములు, ఇతర కీటకాలు, నిన్ను హింసింపకుండుగాక!

నాయనా ! అడవి ఏనుగులు, సింహాలు, పెద్దపులులు ఎలుగుబంట్లు, కోరలుగల దుష్టమృగాలు, అడవిదున్నలు భయంకరమైన కొమ్ములుగల జంతువులు నిన్ను బాధింపకుండుగాక !

నరమాంసం ఆరగించే క్రూరమృగాలు నిన్ను హింసింపకుండుగాక ! నిన్ను కాపాడడం కోసం ఇక్కడనుండే వివిధ



దేవతల్ని, సమస్త ప్రాణుల్ని వేడుకొంటున్నాను. నాయనా ! రామచంద్రా! నీవు శుభస్వరూపుడివి. నీ ప్రయాణములన్నీ హాయిగా సాగుగాక ! నీ పరాక్రమములు సఫలమగుగాక ! నీకు ఏలాంటి వన్యమూల ఫలాలకు లోటు లేకుండుగాక ! నీవు వెళ్ళిరా !

'ఆగమాస్తే శివాః సంతు
స్వస్తి తే స్త్వంతరిక్షేభ్యః పార్థివేభ్యః పునః పునః
సర్వేభ్య శ్చైవ దేవేభ్యో యేచ తే పరిపంథినః
గురుస్సోమశ్చ సూర్యశ్చ ధనదో ऽథ యమస్తథా
పాంతు త్వామర్చితా రామ దండకారణ్య వాసినమ్
అగ్నిర్వాయుస్తథా ధూమో మంత్రాశ్చర్షి ముఖాచ్చ్యుతాః
ఉపస్పర్శన కాలే తు పాంతు త్వాం రఘునందన
సర్వలోక ప్రభు ర్బ్రహ్మా భూతభర్తా తథర్షయః
యేచ శేషాః సురాస్తే త్వాం రక్షంతు వనవాసినమ్ '

అంటూ వినతామాతనుండి గరుత్మంతుడు, అదితివల్ల దేవేంద్రుడు సౌభాగ్య మందినట్లు నీకు శుభములు కలుగుగాక ! మహావిష్ణువునకు (వామనునకు) అబ్బిన శుభములు లభించుగాక !

ఋతవస్సాగరా ద్వీపా వేదా లోకాదిశశ్చ తే
మంగళాని మహాబాహో దిశంతు తవ సర్వదా॥అని ఆశీర్వదించినది.

అంతమాత్రం కాదు. విశల్యకరణి అనే పేర ఓషధితో తనయునికి రక్షాబంధం గావించింది. మనస్సున దుఃఖమున్నా కనబడనీయక రాముని సంతృప్తికై సంతోషం ప్రకటిస్తూ 'నాయనా' సఫల మనోరథుడవై సుఖంగా వెళ్ళిరా ! తండ్రియానను పాలించి వనవాసం నుండి మఱలివచ్చి సింహాసనం అధిష్ఠించిన నిన్ను పరమానందంతో తిలకిస్తాను.

మయార్చితా దేవగణాః శివాదయో
మహర్షయో భూతమహాసురోరగాః
అభిప్రయతస్య వనం చిరాయ తే

హితాని కాంక్షంతు దిశశ్చ రాఘవా !

నేను ఆరాధించే శంకరాది దేవతలు, మహర్షులు భూతగణాలు, నాగదేవతలు, సమస్త దిక్పాలురు వనాలకు వెళుతున్న నీకు సర్వదా హితము గూర్తురు గాక ! అని "స్వస్త్యయనం" యథావిధిగ పూర్తి చేసింది. చివరకు సుమిత్ర కూడా లక్ష్మణుని ఆశీర్వదించి

రామం దశరథం విద్ధి మాం విద్ధి జనకాత్మజామ్
అయోధ్యాం అటవీం విద్ధి గచ్ఛ తాత యథాసుఖమ్.

శ్రీరాముని తండ్రి దశరథునిగా భావింపుము. సీతాదేవిని నన్నుగా తలంపుము. అడవిని అయోధ్యగా భావింపుము. నీవు హాయిగా వెళ్ళి రమ్ము.

దశము అంటే పక్షి. పక్షి రథంగా కలవాడు దశరథుడు. శ్రీమహా విష్ణువు. మా లక్ష్మీదేవి. తల్లి సీతమ్మను లక్ష్మిగా తలంపుము. అయోధ్య అపరాజితం. దేవతలకు గాని, రాక్షసులకు గాని, ఏలాంటి వారికి గాని జయింప శక్యం కానిది అని విశేషార్థాలు. ఈ సందర్భంలో తులసీదాసు రామచరిత మానస్ సుమిత్రాదేవి సీతారాములు తల్లిదండ్రులను, ప్రియపరివారాన్ని, నగర సుఖాన్ని మరచి పోయేలా ప్రవర్తించు. శ్రీ సీతారాముల చరణములపై నీ విశుద్ధ ప్రగాఢ ప్రేమ నిత్యనూతనముగా ఉండుగాక అని లక్ష్మణుని ఆదేశించింది.

## సంవత్సర చందాదారులకు విజ్ఞప్తి

**పవిత్రాత్మ స్వరూపులారా !**

వేదాన్తభేరికి మీ సంవత్సర చందా 2017 డిశంబరుతో పూర్తయింది. ఈ 2018 చందా పంపుడని డిశంబరు భేరిలో ప్రకటించాము. కొద్దిమంది చందా పంపి రెన్యూవల్ చేసుకున్నారు. ఇంకను చాలా మంది పంపలేదు. అయినా మీకు జనవరి 2018 పత్రిక పంపినాము. వెంటనే మీ చందా పైకం నూరు రూపాయలు పంపండి. మీ సంవత్సర చందా పైకం రానిచో ఇకపై పత్రిక మీకు పంపబడదు. - **పబ్లిషర్, వేదాన్తభేరి**



# భాగవత కథలు – భక్త ధ్రువుడు

**మూలం : శ్రీరామచంద్రడోంగరే మహరాజ్ వారు**
**అనువాదం: శ్రీ విద్యాస్వరూపానందగిరిస్వాములవారు**

( గత సంచిక తరువాయి)

తన ఇద్దరి తల్లుల ఆశీర్వాదాన్ని తీసుకొని అయిదు సంవత్సరాల ధ్రువుడు భగవద్దర్శనం కోసరం అడవికి పోతూన్నాడు. ధ్రువుడప్పుడు ఆలోచిస్తున్నాడు – అడవిలో దుష్ట మృగాలుంటాయి గదా ! అవి నన్ను తినేయవా ! అని. మరుక్షణంలోనే లేదు లేదు (తినవు), నేను ఒంటరివాణ్ణి కాదు గదా ! మా తల్లి చెప్పింది " అబ్బాయి! నీవెక్కడి కెక్కడికి పోతావో నారాయణుడు కూడ నీతోటి వుంటాడు" అని.

అందరికి ప్రణమిల్లి, అందరి ఆశీర్వాదాలు తీసుకొని ఎవ్వడు అడవికి పోతాడో అతనికి దారిలో మహాత్ముడు లభిస్తాడు – కలుస్తాడు. ఇంటిలో పోట్లాడి అడవికి పోయేవానికి రాముడు – కలువడు, లభించడు, ధృవుడాలోచిస్తున్నాడు - ఇంటిలో తల్లి నన్ను కుమారా ! అని పిలుస్తూండినది. కానీ ఇచట అడవిలో ఎవడు నన్ను కుమారా ! అని పిలుస్తాడు ? ఈ అడవిలో నన్నెవరు అంకంలో కూర్చుండబెట్టు కుంటారు? నన్నెవరు ప్రేమిస్తారు ?

ధ్రువుడిలా ఆలోచిస్తూ ముందుకుపోతూ వుంటే ఎదురుగా నారదమహర్షివస్తూ కనబడ్డాడు. ధ్రువుడాయన్ను చూచాడు. ఈయనెవరో మహాత్ముడుగా నున్నాడని తలంచి ఆయనకు సాష్టాంగ నమస్కారం చేశాడు. మంచి సంస్కార ఫలమది (మహాత్ములు కనబడగానే దండం పెట్టడం). ఎప్పుడూ ప్రణామం సాష్టాంగంగానే చేయాలి. అష్ట ప్రకృతులు గల పరమాత్మలో కలిసిపోవడానికి ఇష్టాన్ని వ్యక్తం చేసే కోసరం సాష్టాంగ ప్రణామం చేయాలి. ప్రణామం చేయడం ఆత్మ నివేదన అవుతుంది.

అధికారి శిష్యునకు దారిలోనే గురువు లభిస్తాడు. సద్గురుత్వం,

ఈశ్వరత్వం అనేవి రెండూ ఒకటే. పరమాత్మ మరియు సద్గురువు ఇద్దరూ వ్యాపకులు. సర్వవ్యాపిని వెతకడం కాదు, గుర్తించాలి. బాలకుని నమ్రతచూచి నారదుడు ప్రసన్నుడయ్యాడు. ఆయన యొక్క సత్పురుష హృదయం ద్రవీభూతమైంది. ఆ బాలుణ్ణి ఆయన ఎత్తుకొని అంకంపై కూర్చుండబెట్టుకున్నాడు. తలను నిమరసాగాడు. మహాత్ముని చేయి ఎప్పుడు తలపై పడుతుందో అప్పుడు మనస్సులోని అన్ని వికారాలు శమించి పోతాయి. ధ్రువుని కనిపించింది. " నా తల్లి ఆశీర్వాదంతో బాటు దారిలో మరో తల్లి లభించింది " అని.

జన్మనిచ్చిన తల్లి బాలకునికి స్తన్యమిచ్చి పుష్టిని కలుగచేస్తే, గురురూపతల్లి తల్లిపాలు త్రాగడాన్ని శాశ్వతంగా దూరం చేస్తుంది. (పుట్టుక లేకుండా చేస్తుంది) అంటే పుట్టడం చావడం, పుట్టడం చావడమనే చక్రం నుండి ముక్తిని కలుగ చేస్తుంది. స్తన్యమిచ్చే తల్లి శ్రేష్టమా ? మరల తల్లి పాలు త్రాగకుండా (జన్మలేకుండా ) చేసే తల్లి శ్రేష్ఠమా ? స్తన్యాన్ని వదలింప చేసే తల్లి అయిన గురువే శ్రేష్ఠుడు. గురువంటాడు అబ్బాయి ! నీవు మరల ఎప్పుడూ తల్లి పాలు తాగాల్సిన అవసరమే పడని ఉపదేశాన్ని నీకిస్తాను అని.

నారదుడడిగాడు - అబ్బాయి! (కుమారా!) నీవెక్కడికి పోతున్నావు?

ధ్రువుడు జవాబిచ్చాడు - భగవద్దర్శనం కోసరం నేను అడవికి పోతూన్నాను. నాతల్లి చెప్పింది - నా నిజమైన తండ్రి నారాయణుడని, నే నాయన ఒడిలో కూర్చోడానికి పోతూన్నాను. ధ్రువుని మాటవిని నారదుడతనిని పరీక్షించాలనుకున్నాడు. సద్గురువు శిష్యుని పరీక్షించిన తరువాతనే ఉపదేశిస్తాడు. నారదుడన్నాడు - అరే ! నీవిపుడు చిన్నపిల్ల వానివి. ఇది నీవు ఆడుకునే వయస్సు, భగవంతుని జపంచేసే వయస్సు కాదు. భగవంతుడో - "యత్ప్రసాదం సవై పుంసాం దురారాధ్యో మతో మమ " సాధారణ పురుషులకు ఈశ్వరుని ప్రసన్నం చేసుకోవడం



చాల కఠినమైనపని, నీ వెవరి కృపను కోరుచున్నావు అతడు దురారాధ్యుడు (అతన్ని ఆరాధించడం చాలకష్టం). గొప్పగొప్ప ఋషులు అనేక జన్మల పర్యంతం ఈశ్వరుణ్ణి ఆరాధిస్తుంటారు. అయినా వారికి ఈశ్వరుడు లభించడు. వారు భగవంతుని మార్గం వెతకడమేమో వెతుకుతారు. కాని తెలుసుకోలేకున్నారు. నీవు పెద్దవాడవై మొదట అన్ని విధాలైన సుఖాలననుభవించు. ఆపైన వృద్ధాప్యంలో నివృత్తుడవై అడవికిపో, అప్పుడు శాన్తితో భగవద్భజన చై, రామనామాన్ని జపించు, భగవంతుణ్ణి దర్శించు.

భగవంతుడు నిన్ను ఒడిలో కూర్చోబెట్టుకోవాలని కోరుచున్నావు. కానీ గొప్ప గొప్ప ఋషులు, మునులు వేలకొలది సంవత్సరాలు తపస్సు చేసిన తరువాత కూడ ఆయన్ను చూడలేకున్నారు. అలాంటప్పుడు నీవంటి బాలునికి భగవంతుడెట్లు లభిస్తాడు ? కాబట్టి నీవు నీ ఇంటికి తిరిగిపోవడమే మంచిది.

ధ్రువుడు - మహాత్మా ! వీలులేదు. ఏ ఇంటిలో నాకవమానం జరుగుతుందో ఆ ఇంటిలో నేనుండలేను. నా తండ్రి యొక్క రాజసింహాసనంపైన కూర్చోరాదని నేను నిశ్చయించాను. ఈజన్మలో భగవంతుని దర్శించాలని కూడ నిశ్చయించాను. గురుదేవా ! తాము నాకు మార్గదర్శకులు కండి. ధ్రువుని అచంచల నిర్ణయాన్ని చూచి నారదుడు చెప్పాడు - "ధర్మార్థ కామ మోక్షాఖ్యం య ఇచ్ఛేచ్ఛ్రేయ ఆత్మనః । ఏకమేవ హరేస్తత్ర కారణం పాదసేవనమ్ " ఏ వ్యక్తి తన శుభాన్ని కోరుతాడో, మరియు ధర్మార్థకామ మోక్షాలను పొందాలను కుంటాడో, అతనికి శ్రీహరిసేవయే దానికి ఒకే ఒక సాధనము.

నీవు మధువనానికి పో, బృందావనంలో ఆ మధువనం ఉంది. యమున కృపాళువు. యమున కృపాదేవి యొక్క అవతారము. ఎచట పరమాత్మ అఖండరూపంలో వుంటున్నాడో అటువంటి కొన్ని స్థానాల నిర్దేశం భాగవతంలో వుంది. మధువనం, శ్రీరంగం మొదలైనవి ఆస్థానాలు.

శ్రీరంగంలో అనంతశయన పద్మనాభం వుంది. ద్వారకలో కూడ భగవంతుడు విరాజిల్లుతున్నాడు. ఆయన ద్వారకను త్యజించలేదు. గండకీ నదీతీరంలో పులకాశ్రమంలో భగవంతుని అఖండ నివాసం కలదు. ఈ విషయాలు భాగవతం పంచమస్కంధంలో చెప్పబడ్డాయి.

బృందావనంలో భగవంతుని అఖండ నివాసం కలదు. యమున నీ బ్రహ్మసంబంధమైన సిద్ధిని కలుగచేస్తుంది. నారదుడు ధ్రువునికి ఆజ్ఞనిచ్చాడు – "తస్మాత్ గచ్ఛ భద్రం తే యమునాయాస్తటం శుభమ్ పుణ్యం మధువనం యత్ర సాన్నిధ్యం నిత్యదా హరేః ।" అబ్బాయీ ! అంచేత యమునా తీరంలో హరి నిత్యసాన్నిధ్యం గల పావనమైన మధువనానికి పో । నీకు శుభం శ్రేయస్సు కలుగుగాక !

## వేదాన్తభేరికి ఈ క్రిందివారు పోషక చందా పంపినారు

| | | | |
|---|---|---|---|
| 01. | డా॥ పి.హరీష్‌కుమార్ (గుంటూరు) | - | రూ.1500/- |
| 02. | ఆదెపు శంకరయ్య (గోదావరిఖని) | - | రూ.1500/- |
| 03. | ఎన్.కృష్ణమూర్తి (సిద్ధిపేట) | - | రూ.1500/- |
| 04. | డా॥ కె.వి.డి. ప్రవీణ్ (విశాఖపట్నం) | - | రూ.3000/- |
| 05. | ఎస్.మధుసూదనరెడ్డి (దొడ్డిపల్లి –చిత్తూరు) | - | రూ.1500/- |
| 06. | డి.రామకృష్ణ (విశాఖపట్నం) | - | రూ.1500/- |
| 07. | డా॥ జి.రాజేంద్రబాబు (విజయవాడ) | - | రూ.1500/- |
| 08. | వి.విష్ణువర్ధన్ (భద్రాచలం) | - | రూ.1600/- |
| 09. | పి.చంద్రమౌళి (బి.ఎన్.కండ్రిగ,చిత్తూరుజిల్లా). | - | రూ1500/- |
| 10. | జె.రామచంద్రయ్య (అచ్చంపేట) | - | రూ.1500/- |
| 11. | వి.రామాంజనేయులు (తాడేపల్లిగూడెం ) | - | రూ.1500/- |



# హరి పాఠము

**మూలం :శ్రీ జ్ఞానేశ్వర్ మహరాజ్ . తెలుగు :గురుదాస్ మిట్టపల్లి శంకరయ్య**

**అభంగ్ – 2**

చహూ వేదీ జాణ్ సాహి శాస్త్రీ కారణ్ !
అఠరాహి పురాణే హరిసీ గాతీ !!
మంథునీ నవనీతా తైసేఘే అనంతా !
వాయాన్యర్థ కథా సాండీ మార్గు !!
ఏకహరీ ఆత్మా జీవశివసమా !
వాయా తూ దుర్గమా న ఘాలీ మన్ !!
జ్ఞానదేవా పాఠ్ హరి హా వైకుంఠ్ !
భరలా ఘనదాట్ హరి దిసే !!

భావము : నాలుగు వేదముల జ్ఞానము ఆరు శాస్త్రాలకు కారణము పద్దెనిమిది పురాణాలు హరికి సంబంధించిన సారమునే గానము చేయుచున్నవి. మంథనము చేసి నవనీతము తీసినట్లు అనంతుడిని పొందుము. అవసరానికి రాని వ్యర్థ కథలను, మార్గములను వదిలి పెట్టుము. ఒక హరియే ఆత్మా మరియు జీవశివులలో సమముగా ఉన్నాడు. కావున అవసరములేని కథలు సాధ్యము కానటువంటి సాధనలలో మనసు పెట్టకు. హరియే వైకుంఠమనుకొని దట్టముగా నిండి అంతట కనిపించుచున్నాడని హరి పాఠమునే జ్ఞానదేవుడు పఠించినారు.

**నామ సుధ – 2**

నాలుగు వేదాల సంపూర్ణ జ్ఞానము
ఆరు శాస్త్రాల మూల కారణము
పద్దెనిమిది పురాణాల నామ గానము
హరి నామానికి చెందిన సారము
మంథన చేసి నవనీతము తీయుము

చింతన చేసి అనంతున్ని పొందుము
నామము లేని కథలు వ్యర్థము
అన్య మార్గములు వదిలిపెట్టుము
హరియు ఒక్కడే ఆత్మ స్వరూపము
జీవ శివులలో హరి సమానము
కఠిన సాధనను వదిలి పెట్టుము
నామములోనే మనసు నిలుపుము
జ్ఞాన దేవుడు పఠించే నామము
హరి నామము వైంకుఠ ధామము
నిండియున్నాడు హరి దట్టము
కనిపించినదంతట హరి రూపము

**భక్తకన్నప్ప కంటిఆసుపత్రి నిమిత్తం "త్రినేత్ర వైద్యాలయ ట్రస్టు"కు ఈక్రింది వారు పైకం పంపినారు**

(1). డా॥ ఆర్.ఎ.పద్మనాభరావుగారు (హైద్రాబాద్) - రూ.50,000/-
(2). మేడవరపు సుబ్బారావు (శ్రీవెంకటరామకృష్ణ రైస్‌మిల్లు) ఆకివీడు - రూ.50,000/-
(3). ఎ.వి. నగేష్ ఛారిటబుల్ ట్రస్టు (బెంగుళూరు) - రూ.10,000/-
(4).వేదుల వెంకటేశ్వర్లు ( కళ్యాణిఖని, మంచిర్యాల జిల్లా) -రూ.20,000-
(5). కోట్ల మీనాలక్ష్మి (పెనుగొండ,ప.గో.జిల్లా) - రూ.10008/-

**సద్గురు సర్వ సేవా ట్రస్టుకు అన్నదానానికి ఈక్రింది వారు పైకం ఇచ్చినారు**

(1). శ్రీమతి పి.లక్ష్మీదేవి (కడప) - రూ.10,000/-

**ప్రకృతి - యోగ - ఆయుర్వేద చికిత్సల నిమిత్తం చైతన్య ట్రస్టుకు ఈక్రింది వారు పైకం పంపినారు**

(1). సుభద్రా ఛారిటబుల్ ట్రస్టు (హైద్రాబాద్) - రూ.2,00,000/-
వృక్ష వైద్యవనం నిమిత్తం
(2). సద్గురు సర్వ సేవా ట్రస్టువారు (మందుల నిమిత్తం) రూ.10,000/-
(3). శ్రీమతి జి.శాంత (టీచర్,తిరుపతి ) " - రూ. 10,000/-





# శివమహిమ్న స్తోత్రమ్

**శ్రీ మధుసూదనీటీక - తదనువాదం**

**- అనువాదకులు శ్రీ బ్రహ్మవిద్యానందగిరి స్వాములవారు**

**( 2017 డిశంబరు సంచిక తరువాయి )**

**మ.టీ. :** మధ్వితి । హే బ్రహ్మన్ = విభో ! సురగురోర్బ్రహ్మణో ఽపి వాక్ = వాణీ తవకిం విస్మయ పదం చ - మత్కారకారణం కిమ్ । కిం శబ్ద ఆక్షేపే । నేత్యర్థః । తత్ర హేతుగర్భవిశేషణ మాహ । తవ కీదృశస్య। వాచోవేదలక్షణా, నిర్మితవతో - నిఃశ్వాసవదనాయాసేనావిర్భావితవతః। కీదృశీః మధువత్ స్ఫీతాః మాధుర్యాది శబ్దగుణాలంకార విశిష్టత్వేన మధురాః । తథా పరమమమృతం నిరతిశయామృతవదాత్యస్వాద్యామ్। ఏతేన అర్థగత మాధుర్యముక్తమ్ । పరమేశ్వరవాచాం శబ్దార్థగ తయోర్నిరతిశయ మాధుర్యయోరపి మిథస్తారతమ్యం మధ్వమృత శబ్దాభ్యాం ద్యోత్యతే । అయంచ వాచా హిరణ్యగర్భస్య వాణ్యపి న చమత్కారకారణం. తత్ర కావార్తా ఽస్మదాదివాణ్యా ఇత్యర్థః । తర్హికిం స్తుత్యేత్యత ఆహ - మమత్విత్యాది । హే పురమథన । త్రిపురాంతక ! భవతో గుణకథన పుణ్యేన ఏతాం స్వాం వాణీం పునామి నిర్మలీకరో మిత్యభిప్రాయేణైతస్మిన్నర్థే స్తుతిరూపే మమ బుద్ధిర్వ్యవసితోద్యతావతు స్తుతికౌశలేన త్వాం రంజయామీత్యభిప్రాయేణేత్యర్థః । వాజ్ నైర్మల్యేన మనో నైర్మల్యం నాన్తరీయకమితి స్తుతేః సార్థక్యముక్తమ్ । హరిపక్షే ఽప్యేవమ్ ॥ మథ్యతే ఽ స్మిన్ దధ్యాదీతి మథనం గోకులమ్, అథవా మథ్యన్తే ఆపో ఽ మృతార్థమితి మథనః కీరోదః పురం మందిరం గోకులం క్షీరోదోవా యస్యేతి పురమథన సంబోధనార్థః । సర్వమన్యత్సమానమ్ ।

**అను :** హే బ్రహ్మన్ = ఓ విభూ ( వ్యాపకస్వరూపా) ఏమి బ్రహ్మచే చేయబడిన స్తుతిగూడ నీకు చమత్కారహేతువు కాగలదా ? ( అనగా

కామ ) ఎందుకనగా, మాధుర్యాది శబ్దగుణములు మరియు అనుప్రాసాది శబ్దాలంకారములచే నలంకృతమైనందున తేనె వలె మాధుర్యము, అత్యుత్తమము మరియు అమృతముతో సమానమగు అత్యంత స్వాదిష్టము అనగా అర్థగత మాధుర్యాది గుణములు మరియు అలంకారములచే యుక్తమగు "వేదవాణి" నీ నుండినిశ్వాసలవలె అనాయాసముగా వెలువడినది. యద్యపి పరమేశ్వరుని వాణిలో శబ్దము మరియు అర్థము (రెండు ) స్వాభావికముగా నిరతిశయ మాధుర్యము గలవయ్యే ఉండును. (నిరతిశయము = దేనికంటె మరొకటి అధికమైనది లేదో అది ) తథాపి అయినాగూడా ) మధు మరియు అమృతము అను రెండుశబ్దములు శబ్ద గుణాలంకారము మరియు అర్థగుణాలంకరాము, ఈ రెంటిలో పరస్పర తారతమ్యమును బోధించుచున్నవి. పరమేశ్వరుని వాణిలో గొప్పతనమేమంటే శబ్దగుణాలంకారములలో ఉత్కర్ష (ఉత్తమత్వము) లేకున్నా గూడ అర్థాలంకారములలో ఉత్కర్ష గలదు.

తాత్పర్యమేమనగా హిరణ్యగర్భాదుల స్తుతి గూడ నీకు కౌతుకమునకు హేతువు గాదు (నిన్ను ఆశ్చర్యచకితున్ని చేయలేదు). అట్లగుచో ఇక నాలాంటివాని స్తుతి గతి ఏమిటి ?

ప్రశ్న : అట్లయినచో నీవారంభించిన స్తుతి యొక్క ప్రయోసనమేమిటి?

సమాధానము : హేపుర మథన (త్రిపురాంతక!) నీ పవిత్రమైన గుణగానజన్య పుణ్య ప్రభావముచే నా యొక్క వాణి నిర్మలము (పునీతము) కాలగలదను అభిప్రాయముతో నా బుద్ధి నీ స్తుతియందు ఉద్యుక్తమైనది. ఇంతేగాని, స్తుతి కౌశలముతో నీ మనస్సును రంజింపజేయుటకు కాదు. ఈప్రకారముగా వాణి నిర్మలమగుటచే మనస్సుగూడ అవశ్యముగా శుద్ధమౌతుంది. ఇదియే నా స్తుతియొక్క ప్రయోజనము.

హరి పక్షములో గూడ ఇట్లే అర్థమును తెలిసికొనవలెను. మథనము మథ్యతే ఽ స్మిన్దధ్యాదీతి మథనం = గోకులమ్. మథ్యన్తే ఆపో ఽమృతార్థమితి మథనః = క్షీరసాగరమ్ పురం అనగా మందిరము. గోకులము లేదా క్షీరసాగరము యెవరికి మందిరమో, అతడు పురమథనుడు ( విష్ణువు).



# మోళిగ మారయ్య కథ

– శ్రీ మాతా గురుచరణానన్ద

మోళిగ మారయ్య నీలకంఠుని నిజభక్తుడు, మహిమాన్వితుడు. ఇతడు సత్యసదాచార సంపన్నుడు, నాగభూషణ ప్రియుడు, లింగస్వరూపాన్ని క్షుణ్ణంగానెరిగిన వాడు. అడవికి వెళ్ళి కట్టెలు గొట్టి తెచ్చి అమ్మగా వచ్చిన ధనముతో నిత్యము అంబలిగాచి శివగణములకర్పించువాడు. భుజించిన శివగణములు అంబలి అమృతమయమని పొగడెడివారు. ఇదియే అతని దినచర్య. నిత్య నియమాలు దీర్చి మరల అడవికి వెళ్ళెడివాడు. అటగల వన శోభను తిలకిస్తూ మైమరచి తనవి తీరా చూచెడివాడు. చేతులు మోడ్చి " తల్లీ! ఏ జన్మలో జేసిన సుకృత ఫలమో నీవు వనదేవతగా ఈ భువిపై ఉద్భవించితివి. మృగములకు, పక్షులకు, సకల జీవులకు సుఖాన్నిస్తూ ఎంతగానో హితము చేయుచున్నావు. నేను నిమిత్త మాత్రుడిని. నిత్యము అడవికి వెళ్ళి కట్టెలు దెచ్చి అమ్మి వాటితో శరీరపోషణ గావిస్తూ శివగణములను అంబలితో తృప్తి పరుస్తున్నా" నని వనదేవతకు నమస్కరించేవాడు.

మారయ్య ప్రతిదినము కట్టెల మోపు నుండి ఒక కట్టెను తీసి గుడ్డలో చుట్టి ప్రక్క నుంచుచుండెను. అచట భుజించిన శివగణములు యా రుచికరమైన అంబలిని గురించి బసవణ్ణ ఇంటికి జేరి యాతనితో విన్నవించిరి.

బసవణ్ణ నిత్యము ఒక లక్షా తొంబదియారు వేల శివగణములకు నిత్యాన్న దానము సేయుచు చంద్రునిపోలె కళలతో నొప్పుచుండెడివాడు. ఎంతో వైభవముతో నొప్పుచున్న యాబసవరాజు చెంత శివగణములు " ఓ రాజా ! నీ ఇంట షడ్రసోపేతమైన పంచభక్ష్య పరమాన్నములకన్నా మోళిగె మారయ్య ఇంట అంబలి ఎంతో రుచికరమని అదంతా

గంగాధరుని మహిమయే" యని విన్నవించిరి.

నా సంఘములో యున్న శివభక్తుడు కడుబీదవాడైనను ఇంతటి మహత్తు కలవాడా ! అతని కష్టమును పరిహరించవలెనని ఎంచి బసవరాజు వేయి వరహాలనుగొని మారయ్య ఇంటికి వేగిరమే వెళ్ళెను. బయటనే నిలచి "తల్లీ ! ఇంటిలో నెవరున్నారు. నేను దాహార్తిని. దాహము తీర్చగలరా " యని అడిగెను. మారయ్యసతి విని వెంటనే దాహము తీర్చుటకు జలమును గైకొని వచ్చెను. శివభక్తుడై వెలుగు బసవరాజును గాంచి "స్వామీ ! మా ఇంటకాలిడి శివపూజ గావించుడి" యని లోని కాహ్వానించెను. బసవరాజు గృహమందు ప్రవేశించి శివపూజ మొదలిడెను. శివపూజకు కావలసిన సామాగ్రిని అందించి ఆమె తనపనికై వెడలెను. అంత బసవరాజు శివపూజగావించి వరహాల మూటను అటయుంచి బిల్వపత్రితో దానిని కప్పియుంచెను. తల్లీ ! నే వెళ్ళెదనని చెప్పి తన మందిరమునకు వెడలెను.

కట్టెల మోపుతో గృహమును సమీపించిన మారయ్య "ఏమిటీ దుర్గంధము ఇంటి నుండి వచ్చుచున్నదే" యనుచు కట్టెల మోపును క్రిందవైచెను. అంతలో ఆయన భార్య ముఖ ప్రహేళనమునకు జలమును దెచ్చెను. కాళ్ళు చేతులు ముఖము కడుగుకొని, భస్మము ధరించి శివుని కభిషేకముగావించుచూ బిల్వ పత్రముల మధ్యయున్న వరహాల మూటను గాంచెను. దానిని చూచి ఆశ్చర్య చకితుడై "ప్రాణప్రియా ! ఏమిటీ వింత" యని అడిగెను.

అంతనామె "ప్రాణపతీ" ! ఇదెలావచ్చెనో నేనెరుగను. నే నింటిలో యుండ దాహార్తియై వచ్చిన ఒకశరణుడు జలమిమ్మని అడిగెను. నేను వారిని శివపూజ గావించి స్వీకరించుడని ఇంటిలోనికాహ్వానించితిని. వారికి కావలసిన పూజా సామాగ్రి సమకూరుస్తూ నేను ప్రక్క కెళ్ళితిని. వారే ఆ సొమ్మునచట ఉంచి యుండవచ్చు " నని సెలవిచ్చెను.

భార్య మనసు తెలియ గోరి మారయ్య " ఈ ధనముతో నీకు



ఆ భరణములు తెమ్మందువా ! నిత్యము పంచభక్ష్య పరమాన్నాలతో జిహ్వకు రుచికరమగు వంటలు తయారు చేసి శివగణముల కర్పింతువా ! యనెను.

భర్త మాటలు విని యా అర్ధాంగి "ప్రాణనాథా ! నన్ను పరీక్షింప దలచితిరా ! పరద్రవ్యము సకల సౌఖ్యములను హరింపజేయును. ముక్తిని దూరముసేయును" అని దెల్ప భార్య మనసు నెరిగిన మారయ్య సంతసించెను. మా బీదరికమును బాపుటకు బసవరాజే ఈ కృత్యము సల్పెనని ఎంచి యావరహాల మూటను తనకట్టెల మోపుయందుంచుకొని వెడలి బసవరాజు గృహము ముంగిట పారవైచి కట్టెల మోపును అమ్మగా వచ్చిన ధనముతో గృహము జేరెను. తన సతితో " ఓ ప్రాణ సఖీ ! నీవు సమృద్ధిగా భక్ష్య భోజ్యములను సేయుము. నేను బసవరాజును యాతని గణములను భోజనమున కాహ్వానింతును. పేదవాడని ధనికుడైన బసవరాజుగావించిన ఈ కృత్యము సరికాదు. అతనికి శివుని తత్వము తెలియపరచెద "నని ఆహ్వానించుటకు వెడలెను.

అంతనా సతి శివనామస్మరణగావించుచూ తెచ్చిన సరకులపై చేతులుంచగా అదంతా పంచభక్ష్య పరమాన్నములుగా మారెను.

బసవరాజు మందిరమున కేతించిన మారయ్యను సత్కరించి కూర్చుండజేసి వచ్చిన కార్యమేమని ప్రశ్నించెను.

"ఓ భూపాలా ! దీనరక్షకా ! కరుణాసాగరా ! మా గృహమును పావనము సేసి మేమిచ్చు ఆతిథ్యమును స్వీకరించుటకు తమ గణములతో రావలసినదిగా ప్రార్థిస్తున్నాను. "

అనగా విని బసవరాజు " ఓ మారయ్యా ! మేము మా గణములతో విచ్చేసిన యావన్మందికి సరిపోవునా " యని హాస్యముతో మాటలాడెను. " ఆ సర్వేశ్వరుని కృపచే దృఢమైన గృహము నిర్మాణము గావించవచ్చు. సర్వము వ్యాపించిన యా శివుని మహిమ ఎవరికెరుక " యని గణములునుడివిరి. ఒకలక్షా తొంబది యారువేల గణములతో కలసి బసవరాజు మారయ్య ఆతిథ్యమును స్వీకరించుటకు పయనమయ్యిరి.

తన సదనమున కరిగిన మారయ్య శివుని నిత్య కార్యక్రమములు సల్పి శరణులు అన్న పానీయములు స్వీకరించుటకు తగిన స్థలము సమకూర్చుమని శివుని " ఓ దయామయా ! అనాథ రక్షకా, శంభో, త్రిపురారులను సంహరించిన వాడా ! నీలకంఠా, ఫాలలోచనా కరుణించు, నీ గణములకు ప్రీతిని గూర్చడానికై స్థలమును సమకూర్చు " మని వెడుకొనెను.

దయామయుడైన పరమశివుడు స్తోత్రమునకు ప్రీతి జెంది మణిమయ రత్నములతో కూడిన మంటపము యోజన దూరము విస్తరించునట్టుగా క్షణములో నిర్మించెను. శివశరణుడైన మారయ్య జూచి వందనమర్పించెను.

వచ్చిన గణములకు నీటి సౌకర్యము సమకూర్చుటకు గంగాదేవిని స్మరించెను. "సర్వులకు మూలాధారమైన ఓ గంగామాతా ! కాలకృత్యములు దీర్చుటకు, పానముసేయుటకు ప్రవహించి రా తల్లీ"యని ప్రార్థింప గంగాదేవి కరుణించి కమండలములోని నీటిని నేలపై కుమ్మరించగా. నదులై మంటపము చెంత ప్రవహించెను. బసవరాజు గణములు నచటికి చేరిరి.

సతీపతులిరువురు వచ్చిన వారికి పాత్రలతో నీరందించిరి. శివపూజ గావించి అర్పించిన ప్రసాదమును తృప్తితో భుజించి మారయ్యను పలువిధములుగా స్తుతించిరి. ఆనందించిన మారయ్య "గణములతో నేనెంతటివాడను. ఆ శివుడే నా పేదరికమును గమనించి సర్వమును సమకూర్చెను. నేను నిమిత్తమాత్రుడ " నని విన్నవించెను.ఆ మాటలు విన్న బసవరాజుకు గర్వభంగమాయెను.

" ఓ దేవా ! నేను జ్ఞానశూన్యుడను. నీ పాదారవిందముల మహిమ తెలియతరమా ! సోహం నానుడి నాగర్వమును తొలగించినది. పరుసవేది సోకితే ఇనుము బంగారమగునట్టు అజ్ఞానులపై శివశరణుల హస్తముంచితే జ్ఞానులౌదురుగదా ! నా మనసులో యున్న అహంకారము తొలగినది



నన్ను క్షమించు పరమశివా " యని వేడెను.

దీన వదనముతో యున్న బసవరాజును మారయ్య జూచి సోహం భావముచే సర్వము సమకూరునని తక్కిన శివశరణు లెల్లరకు దక్షిణ తాంబూలాదులొసగ సాగెను.

దిన దినము తెచ్చిన కట్టెల మోపు నుంచి ఒక్కొక్క కట్టె తీసి గుడ్డలతో చుట్టి యున్న వాటిపై శివమంత్రాన్ని జపిస్తూ వాటిపై జలమును చల్లెను. అవన్నియు బంగారు కడ్డీలుగా మారిపోయెను. శరణులందరికి ఒక్కొక్కటి దానము జేసెను. అతడు శరణుడుకాదు మహాయోగియని కొండాడుతూ వారి నివాసములకు వారు బయలుదేరిరి.

మోళిగ మారయ్య దృఢ తరభక్తి కథను చదివిన జనులకు శివుని కరుణ గలుగుట తథ్యము.

# జ్ఞానామృతం

– శ్రీ రామకృష్ణానందగిరి స్వాములవారు,(గండిక్షేత్రము)

**1.** జీవితంలో కలిగే దుఃఖాలను, కష్టాలను ధర్మబుద్ధితో, వివేకబుద్ధితో ప్రీతిగా సహించుటే తపస్సు. తపః ప్రభావంతో నరుడు నారాయణుడౌతాడు. మానవుడు మాధవుడౌతాడు.

**2.** సరోవరంలో చేపలధికంగా వుంటే నీరు ఎంతో స్వచ్ఛంగా పవిత్రంగా వుంటుంది. అలాగే సాధువులు అధికంగా వుంటే సమాజం బాగుపడుతుంది.

**3.** పరమాత్మయందు దృష్టి లేకపోతే ప్రపంచం నిన్ను యేడ్పిస్తుంది. నీపై స్వారీ చేస్తుంది. పరమాత్మునికి అభిముఖుడవైనావా మాయా ప్రకృతి నీకు పాదదాసి అవుతుంది.

**4.** అసురులనగా ఎవరు ? అసురులనగా ప్రాణాలు. వాటి తృప్తి కోసరమే జీవించే వాళ్లు, తమ బ్రతుకుకోసం ఇతరులకు యెట్టి క్లేశమైనా కల్గిస్తారు. భగవంతుడు, భక్తి వీరికి పనిలేదు. శాస్త్రమోగీస్త్రమో దానితోను పనిలేదు. వారికి కావలసింది విధేయ భోగాలు. వీరే ఆసురీ ప్రవృత్తి గలవారు.

**5.** వేదాంతం అన్నాన్ని కాదు, అమృతాన్ని పెడుతుంది. కాని త్రాగటానికి దేవతలు కావాలి. రాక్షసులు కాదు.

# శ్రీ మదాంధ్ర మహా భాగవతము

– ఆచార్య జక్కంపూడి మునిరత్నం ( తిరుపతి )

( గత సంచిక తరువాయి )

**అన్వేషణ :** ఒకరోజు పరీక్షిత్తు వేటకు వెళ్ళాడు. అడవంతా తిరిగి ఉత్సాహంగా వేటాడాడు. అడవి పందులనూ, అడవి ఎద్దులనూ, తోడేళ్ళనూ, పెద్ద పులులనూ, సివంగులనూ, ఖడ్గ మృగాలనూ, అడవి గొర్రెలనూ, సింహాలను, ఏనుగులనూ, శరభాలనూ, జడల బర్రెలనూ, కొండ చిలువలనూ వేటాడి పడగొట్టాడు. అలసిపోయాడు. దాహం వేసింది. ఏదైనా జలాశయం కనిపిస్తుందేమోనని అడవంతా తిరిగాడు.

## ఎవరి కెఱుక ?

– ఆచార్య కె. పర్షోత్తమరావు ( తిరుపతి )

[illegible]నంలో ప్రవేశించాడు. అక్కడ ఒక ముని [illegible]యనే శమీక మహర్షి. ఆ మహర్షి పొడుగాటి [illegible]న్ని ధరించి ఉన్నాడు. అతడు ఇంద్రియాలను జయించాడు. జాగ్రత స్వప్న సుషుప్తులనబడే మూడు స్థితులను అధిగమించాడు. [illegible] స్థితిగా పరిగణింపబడే సమాధి స్థితిలో నిలకడగా కూర్చున్నాడు. పరబ్రహ్మానుసంధానం చేసి పరమేశ్వర చింతనంలో విశ్వాన్నే విస్మరించి ఉన్నాడు.

పరీక్షిత్తు ఆయన్ను సమీపించాడు. వేటాడి అలసిపోతూన్నానన్నాడు. తన పరివారమంతా దూరంగానే ఉండిపోయారన్నాడు. తట్టుకోలేని దాహమన్నాడు. నీళ్ళు ఇప్పించమని దగ్గుత్తికతో కోరాడు. అయినా ఫలితం లేకపోయింది. రాజు రాకను శమీకముని గుర్తించనైనా లేదు. కళ్ళు తెరవలేదు. ముని పరమేశ్వరచింతా పరతంత్రుడు కావడం వల్ల ఇంద్రియ జ్ఞానం కూడా మునికి ఆ సమయంలో లేదని రాజు తెలుసుకోలేకపోయాడు. ముని తపస్వినన్న గర్వంతో తనను తృణీకరించాడని భావించాడు. అవమానింపబడ్డానన్న ఆలోచన రాజును కుంగదీసింది. కోపాన్ని ఆపుకోలేక పోయాడు. వింటికోపుతో చనిపోయిన ఒక సర్పాన్ని తీసుకువచ్చి ముని భుజం మీద వేసి చక్కాపోయాడు.



సమీపంలో ఆడుకుంటున్న ముని బాలకులు ఆ దృశ్యాన్ని చూశారు. శమీకమహర్షి కుమారుడు శృంగి దగ్గరకు వెళ్ళారు. ఎవరో రాజు అతని తండ్రి భుజం మీద సర్పశవాన్ని వేసి వెళ్ళాడని చెప్పారు. శృంగికి కోపం వచ్చింది. రాజులను ఇష్టం వచ్చినట్టు తూలనాడాడు. బంగారు మొదలైన దానాలు పుచ్చుకోవడానికి మేము వెళ్ళమే ! ఆశీర్వదిస్తామని చెప్పి మోసంతో డబ్బు గుంజమే ! అడవిలో కందమూలాలు తిని జీవిస్తామే ! అలాంటి మాకు అపకారం చెయ్యడానికి రాజుకు ఏం పోయేకాలం వచ్చిందో' అని విచారించాడు. శృంగి పెద్ద పెద్ద కేకలు వేశాడు. కౌశికీ నదికి వెళ్ళి నీళ్ళు చేతిలోకి తీసుకున్నాడు. ఎటువంటి సంకోచమూ లేకుండా మృత సర్పాన్ని తెచ్చి మా తండ్రి మెడలో వేసిన ఆ రాజు హరిహరులు అడ్డుపడినా ఈనాటికి ఏడవనాడు తక్షకుడి విషాగ్ని జ్వాలలతో దగ్ధుడై మరణిస్తాడు' అని దారుణంగా శపించాడు.

శృంగి అక్కడ నుంచి వేగంగా తమ ఆశ్రమానికి వచ్చాడు. తండ్రి ఇంకా సమాధి స్థితిలోనే ఉన్నాడు. అతని మెడలో వ్రేలాడుతున్న ఆ మృతసర్పమింకా అలాగే ఉంది. శృంగి బిగ్గరగా అరుస్తూ రాజును దుయ్యబట్టాడు. ఆ మృత సర్పాన్ని తీసివేసి తన తండ్రిని రక్షించవలసిందిగా పరిసర ఆశ్రమాల్లోని ఋషులను ఎలుగెత్తి పిలిచాడు. గట్టిగా రోదించాడు.

కుమారుడి ఆక్రందనకు తండ్రి శమీకమునికి బాహ్యస్మృతి వచ్చింది. ఎందుకేడుస్తున్నావని కుమారుణ్ణి అడిగాడు. తనమీద ఆ కాలసర్పాన్ని ఎవరు వేసి వెళ్ళారని ప్రశ్నించాడు. రాజు చేసిన దుష్కృత్యాన్ని, తానతన్ని శపించడాన్ని శృంగి శమీకమహర్షికి చెప్పాడు. శమీక మహర్షి తన యోగదృష్టి ద్వారా కుమారుడి శాపానికి గురైన రాజు పరీక్షిత్తు అని తెలుసుకున్నాడు. మిక్కిలి విచారించాడు. మందలింపు ధోరణిలో మాట్లాడడం మొదలెట్టాడు.

ఈ మాత్రం దానికే రాజును ఇంత ఘోరంగా శపించాలా?

కృష్ణుడు అవతారం చాలించాక దొంగలూ దుండగులూ పెచ్చరిల్లారు. మనరాజు వారిని నిగ్రహించి ధర్మబద్ధంగా పరిపాలిస్తున్నాడు. అటువంటి ధర్మాత్ముడినా నువ్వు శపించడం ? నీ మూలంగా మనకు పాపం వచ్చింది. రాజు మరణిస్తే రాజ్యంలో అరాచకం పెరుగుతుంది. దుర్మార్గులైన అధర్మపరులదే పైచేయి అవుతుంది. ప్రజలు పరస్పరం కలహించుకుంటారు. ధర్మం నశిస్తుంది.

సకల సద్గుణ సంశోభితుడూ రాజశ్రేష్ఠుడూ అయిన పరీక్షిత్తు మహారాజు మన ఆశ్రమానికి వస్తే ఆయనకు నీళ్ళివ్వక పంపినా పంపవచ్చునేమో గాని ఈవిధంగా శపించడం ఏమి న్యాయం ? పరమ భాగవతులు తమను ఎవరు తిట్టినా కొట్టినా పడుతూ ఉంటారే కాని పట్టించుకోరు. ఇతరుల వల్ల మేలు కలిగినప్పుడు పొంగిపోరు. కీడు కలిగితే కుంగిపోరు. ఇది మంచివాళ్ళ లక్షణం. ఆత్మకు సుఖదుఃఖాలు తీవ్రతరంగా అంటవు '. శమీక మహర్షి రాజుకి ఈ శాపోదంతమంతా చెప్పి రమ్మని ఒక మునిబాలకుణ్ణి పంపాడు. ముని బాలకుడి ద్వారా పరీక్షిత్తు మహారాజు జరిగిందేంటో తెలుసుకున్నాడు. కామక్రోధాది దుర్గుణాలతో సంసార సాగరంలో పడి సతమతమౌతున్న తనకు తక్షక విషాగ్ని కీలలు వైరాగ్య హేతువులు కాగలవని తన్నుతానే ఊరడించుకున్నాడు. హస్తినాపురానికి వెళ్ళి ఏకాంతంగా వితర్కించుకో సాగాడు.

' నేను ఎందుకు వేటకు వెళ్ళాను ? సమాధిలో ఉన్న ఆ మునిమీద చచ్చిన పామును ఎందుకు తెచ్చి వేశాను ? ఇదంతా దైవ సంకల్పం వల్లనే జరిగి ఉంటుంది. కీడు తప్పదు. తొందరగానూ వచ్చి తీరుతుంది. ఏది ఏమైనా క్షణికమైన జీవితం కోసం ఆ ముని కుమారుణ్ణి ఏమని శపించగలను ? నేనే వాళ్ళ ఆశ్రమానికి వెళ్ళి రాజునన్న గర్వంతో సర్పశవాన్ని తెచ్చి తమ తండ్రి భుజం మీద వేసి వస్తే ఎవ్వరైనా శపించకుండా ఉంటారా ? అతని తప్పుమాత్రం ఏముంది? ' పరీక్షిత్తు ఆలోచనలు ఇలా సాగాయి. **(సశేషం)**



# శైవసిద్ధాంతము - శైవాగమాలు

- శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

**ఓం శివాయ గురవే నమః**

సృష్ట్యాది నుండి ఏదో ఒక అద్భుతశక్తి సదా సర్వత్ర పని చేస్తుండడాన్ని మనం ప్రత్యక్షంగా చూస్తున్నాము. అది అఖండం. ఆశక్తే పరమాత్మ. ఆ శక్తే భగవంతుడు, పరమేశ్వరుడు, అతడు సచ్చిదానందస్వరూపుడు, స్వయంప్రకాశుడు, సర్వతంత్ర స్వతంత్రుడు, త్రికాలాబాధ్యుడు. పరిణామరహితుడు, సర్వజ్ఞుడు, సర్వవ్యాపి, సర్వాంతర్యామి. ఈశావాస్య మిదగ్ం సర్వం అంటూ ఈ విషయాన్నే ఈశావాస్యోపనిషత్తు తెలిపింది. కఠోపనిషత్తున్ను ఏష సర్వేషు భూతేషు గూఢాత్మాన ప్రకాశతే అంటూ భగవంతుని సర్వవ్యాపకతను ప్రతిపాదించినది. శ్వేతాశ్వతరోపనిషత్తు గూడ ప్రతిప్రాణిలో ఒకే పరమాత్మ ప్రకాశమానుడై, సర్వవ్యాపకుడై, సర్వభూతాంతరాత్ముడై, సర్వకర్మాధ్యక్షుడై, సాక్షిమాత్రుడై, చేతనుడై, కేవలుడై, నిర్గుణుడై, గూఢంగా వున్నాడు అంటూ విశదీకరించింది.

ఆ భగవంతుడే సృష్టి - స్థితి-లయములకు కర్తయై బ్రహ్మ-విష్ణువు- శివుడనబడినాడు. ఆ భగవంతునికి గల అనంత రూపాల్లో, పేర్లలో - శివుడు, పరమేశ్వరుడు, ఈశానుడు మొదలైనవి కొన్ని. నిర్గుణుడు, సర్వవ్యాపి, సర్వశక్తిమంతుడగు భగవంతుని పొందాలంటే - సాక్షాత్కరించుకోవాలంటే అతని నామాన్ని ఆశ్రయించి దానిని జపించడం సులభమార్గం. మననాత్ త్రాయత ఇతి మంత్రః - భగవన్నామము తనను జపించువానిని సంసార దుఃఖం నుండి తరింపజేస్తుంది కాన మంత్రం అనబడింది.

ఇట్టి మంత్రాలలో నమశ్శివాయ అనే పంచాక్షరీమంత్రం శ్రేష్ఠమైంది. ఈ విషయాన్నే శ్రీ రేణుకాచార్యులవారు అగస్త్యమునికి 'శివతత్త్వా త్పరం నాస్తి యథా తత్త్వాన్తరం మహత్' అంటూ పంచాక్షరీ మంత్రం సర్వశ్రేష్ఠమని చెప్పి యున్నారు. మఱియు 'అశేష జగతాం

హేతుః పరమాత్మా మహేశ్వరః, తస్య వాచకమంత్రో ఽయం సర్వమంత్రైక కారణమ్'. ఎట్లు సమస్త జగత్తులకు పరమాత్మయైన మహేశ్వరుడు కారణమో అట్లే ఆమహేశ్వరుని నామమగు నమశ్శివాయ అను పంచాక్షరీ మంత్రమున్ను అన్ని మంత్రాలకు మూలము అని చెప్పి యున్నారు. అంతేగాక – 'ఆదితః పరిశుద్ధత్వాత్, మలత్రయ వియోగతః శివ ఇత్యుచ్యతే శంభుశ్చిదానదఘనః ప్రభుః' ఆది నుండి ఆణవాదిమలములు లేనివాడై పరిశుద్ధుడైనందున అన్నింటికి ప్రభువు, సచ్చిదానందఘనుడగు శంభుడు శివ అని చెప్పబడుచున్నాడు. మఱియు 'ఆస్పదత్వా దశేషాణాం మంగళానాం విశేషతః ! శివశబ్దాభిధేయో హి దేవదేవ స్త్ర్యంబకః'.సమస్త శుభాలకు విశేష స్థానమైనందున దేవతల కెల్ల దేవుడగు త్ర్యంబకుడు శివుడు అనుపేరుతో పిలువబడుచున్నాడు.

ఇట్టి శివ అనే రెండక్షరాలు గల భగవంతుని నామము 'శివ ఇత్యక్షరద్వంద్వ పరబ్రహ్మ ప్రకాశకం'. పరబ్రహ్మను తెలియజేయుచున్నది. కాబట్టి 'తస్మాన్ముఖ్యతరం నామ శివ ఇత్యక్షరద్వయం, సచ్చిదానందరూపస్య శంభో రమితతేజసః' ॥శివ॥ అను రెండక్షరముల ఈపదము సచ్చిదానందస్వరూపుడైన, అతి తేజస్వియైన పరమేశ్వరుని నామములలో కెల్ల ముఖ్యాతిముఖ్యము. నమశ్శివాయ అనే పంచాక్షరీ మంత్రాన్ని మోక్షాన్ని కోరేవారు శ్రద్ధతో ఆదరంతో సదా జపించాలని రేణుకాచార్యు లంటున్నారు. 'యథా ఽ వాదీ ర్మహాదేవః సిద్ధ పాపవిమోచకః! తథా పంచాక్షరీ మంత్రం సంసారక్షయసిద్ధిదః ॥ ఈ పంచాక్షరీ మంత్రం సంసారాన్ని నాశనం చేసి మోక్షాన్నిస్తుంది. అని, అంతేగాక 'పంచాక్షరీ మిమాం విద్యాం ప్రణవేణ షడక్షరీం యజేత్సమాహితో ! భూత్వా శివపూజా పరాయణః' శివపూజాపరాయణుడు ఈ ప్రణవ సహిత పంచాక్షరీ మంత్రాన్ని ఏకాగ్రచిత్తంతో జపించాలి అంటూ నిర్దేశించాడు. జ్యోతిష్టోమాది ద్రవ్యయజ్ఞాలు ఈ జపయజ్ఞ ఫలితంలో 16వ భాగఫలితానికి సమం కావు. ఈ విషయాన్నే 'యావంతః కర్మయజ్ఞాద్యా వ్రతదానతపాంసి చ సర్వే తే జపయజ్ఞస్య కలాం నార్హంతి షోడశీమ్' అన్నది శైవాగమశాస్త్రం. **( సశేషం)**



# వార్తలు

**(01).** 2018 జనవరి 5వ తేది భగవాన్ రమణమహర్షిజయన్తి సందర్భంగా శ్రీశుకబ్రహ్మాశ్రమంలో భగవాన్ రమణ మహర్షికి పూజ అర్చన జరిగినది. ప్రసాద వినియోగం జరిగినది.

**(02).** జనవరి 2వ తేది పౌర్ణమి సందర్భంగా ఆశ్రమంలో గురు దేవులపాదుకా పూజ జరిగినది.

**(03).** జనవరి 12వ తేది స్వామివివేకానందజయన్తి సందర్భంగా శ్రీశుకబ్రహ్మాశ్రమంలో స్వామి వివేకానందకు షోడశోపచార పూజ జరిగినది.

**(04).**జనవరి 14వ తేది మకర సంక్రాన్తి సందర్భంగా ఆశ్రమంలో విశేష పూజలు జరిగాయి.

**(05).** జనవరి 24వ తేది రథసప్తమి సందర్భంగా ఆదిత్య హృదయం అఖండ పారాయణ జరిగినది.

**(6).** శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో 8వ జ్ఞానసదస్సు జనవరి 2వ తేది సాయంకాల ప్రవచనతో ఆనందప్రదంగా ముగిసినది. పూజ్యశ్రీ ప్రణవానందగిరిస్వాములవారు (ఉమామహేశ్వర పీఠాధిపతులు) 5 రోజులు ఉదయం, సాయంకాలం రెండుపూటలా ఛాందోగ్యోపనిషత్తులోని ఉద్గీథోపాసన, తత్త్వమసి మొదలగు వానిని చాలా హృదయంగమంగా చెప్పారు. 30 మంది సదస్యులు చాల ఆనందించారు.

**(7).** 9వ జ్ఞాన సదస్సు మాఘ పౌర్ణమితో పూర్తయినది. ఆచార్యులు పూజ్యశ్రీ పరమాత్మానందగిరిస్వాములవారు ముండకోపనిషత్తును చెప్పారు. శ్రోతలు ఇందులో పాల్గొని స్వామి ప్రబోధను విని చాల ఆనందించారు.

**(8).** 2018 ఫిబ్రవరిలో 2,3, 4 తేదీలందు కరీంనగర్ జిల్లా ప్రస్తుతం జగిత్యాల జిల్లా మెట్పల్లిలో జరుగు శ్రీసత్యానందమహర్షి చతుశ్శతతమ సంచార సత్సంగంలో పూజ్యశ్రీ విద్యాస్వరూపానందగిరిస్వాములవారు పాల్గొని ప్రవచన చేస్తారు.

**(9).** 2018 ఫిబ్రవరిలో విశాఖపట్టణంలో జరుగు అఖిలాంధ్ర సాధు పరిషత్సభలలో పూజ్యశ్రీ విద్యాస్వరూపానందగిరిస్వాములవారు పాల్గొని ఉపన్యసిస్తారు.

**(10).** ఆశ్రమ కంటి ఆసుపత్రిలో డిశంబరు నెలలో ఓ.పి.లో **474** మందికి కంటి పరీక్షలు, చికిత్సలు చేయబడినవి. **44** మందికి కంటి పొరలు తీసి కళ్లలో లెన్సు అమర్చబడినవి. **ఒకరికి** యాగ్ లేజర్ చికిత్సలు జరిగినది. 4 గ్రామాలలో కంటి వైద్య శిబిరాలు నిర్వహింపబడినవి.